

22ND ANNIVERSARY

# నేటిధాత్రి®

తెలుగు వార్త పత్రిక



ఆదివారం 31-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 57 రూ॥ 6.00




# కేసీఆర్ అంటేనే ఒక శకం.. ఒక యుగం!

## తెలంగాణ అంటేనే ఒక డిక్షనరీ.. కేసీఆర్ అంటేనే డిస్కవరీ!





## భౌతిక తెలంగాణ, భౌగోళిక తెలంగాణ సృష్టి కర్త కేసీఆర్



చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

- తెలంగాణ ఉన్నంతవరకు చేరపలేని పదం కేసీఆర్!
- ఎప్పటికీ చెరిగిపోనిది కేసీఆర్ కీర్తి... కేసీఆర్ మాత్రమే తెలంగాణ ఆర్తి.
- మసక బారెందుకు కేసీఆర్ గోడల మీద రాత కాదు.



హైదరాబాద్, నేటిధాత్రి:
ఈ నేల మీద కొందరే కారణ జన్ములు ఉద్భవిస్తారు. వాళ్లే చరిత్రకు శ్రీకారం చుడతారు. చరిత్ర కారులౌతారు. యుగ పురుషులౌతారు. తమ శకాన్ని ఆవిష్కరిస్తారు. అది ఏ స్దాయిలో వున్నా, ఆయా ప్రాంతాల జీవితాలలో వెలుగులు నింపుతారు. మన దేశంలో దేశ స్వాతంత్ర్య పోరాటం తర్వాత కూడా కొని ఉద్యమాలు సాగాయి. పోరాటాలు జరిగాయి.

- స్వీయ తెలంగాణ తల రాత రాసిన అపర బ్రహ్మ.
- తెలంగాణకు కేసీఆరే జాగ్రఫీ.
- తెలంగాణ ఆత్మ గౌరవం కేసీఆర్.
- తెలంగాణ కు మలి తరం లో ఆత్మ నింపిన యుగ కర్త కేసీఆర్.
- తెలంగాణలో ఈ శక స్ఫూర్తి ప్రదాత కేసీఆర్.
- భవిష్యత్తు తెలంగాణకు కేసీఆర్ అనే పదమే ఊపిరి.
- ఆ ఊపిరి తెలంగాణ మొత్తం ఆవహించి వుంది.
- ఆ గర్జన ఎన్ని యుగాలైనా వినిపిస్తూనే వుంటుంది.
- తెలంగాణ వ్యతిరేకుల గుండెల్లో మారుమ్రోగుతూనే వుంటుంది.
- కేసీఆర్ ఒక కదలి ప్రపంచం...తెలంగాణ అలల రువ్వడి ప్రతి రూపం.
- తెలంగాణ కదలి అలల గర్జన ఎల్ల కాలం కొనసాగుతూనే ఉంటుంది.
- ఎన్ని యుగలైనా కేసీఆర్ నామ స్మరణ జరుగుతూనే వుంటుంది.
- కేసీఆర్ తెలంగాణ సెంటిమెంట్.. తెలంగాణ స్టేట్ మాన్ కూడా!

అందులో దేశమంతా గొప్పగా చెప్పుకునే ఉద్యమం తెలంగాణ ఉద్యమం. ఆది సాదా సీదా ఉద్యమం కాదు. సుమారు 60 ఏళ్లపాటు ఒక ప్రాంత ప్రజలు తమకు విముక్తి కావాలని కోరుకున్నారు. మరో ప్రాంత నాయకులు దృత రాష్ట్ర కౌగిలిలో నలిగిపోతున్నామని కోరారు. అలా అరవై ఏళ్లపాటు ఒక ప్రాంతం తమ ఆర్తిని అనేక రకాల ఉద్యమ స్వరూపాలలో చెప్పినా కేంద్రం అంగీకరించలేదు. అలా తెలంగాణ ప్రాంతం అనుభవించిన కష్టం అంతా ఇంతా కాదు. అందులోనై అరవై ఏళ్లు అంటే అది చిన్న సమయం కాదు. ఒక తరం కన్నీళ్లతోనే వెళ్లిపోయింది. మరో తరం ఆ కన్నీటిని మోస్తున్న సమయంలో తెలంగాణలో యుగ పురుషుడు అవతరించారు. ఆయనే కేసిఆర్. తెలంగాణ అనే ప్రాంత ప్రజల ఆకాంక్ష నెరవేర్చడానికి కేసిఆర్ చేసిన ప్రయత్నం విజయవంతమైంది. అరవై ఏళ్లుగా సాద్యం కాని, సాద్యం కాదనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాదించారు. అయితే దేశ స్వాతంత్ర్యం వందేళ్లపాటు సాగింది. అంతకు ముందు కూడా జరిగింది. కాని ఆఖరు దశలో సుమారు ఓ ముప్పై సంవత్సరాల పాటు ముందుండి నడిపిన మహాత్మాగాంధీకి కీర్తి మిగిలింది. అంటే అంతకు ముందు ఉద్యమాలు, పోరాటాలు చేసిన వారి పంథాలో కాకుండా తనదైన శైలిలో ఉద్యమాలను రూపకల్పన చేసిన మహాత్మాగాందీని ఆంగ్లేయులు తట్టుకోలేకపోయారు. స్వాతంత్ర్యం ఇచ్చారు. అలాగే తెలంగాణ విషయంలోనూ సరిగ్గా అదే జరిగింది. తెలంగాణ, ఆంధ్ర రెండూ కలిసి నాటి నుంచే మొదలైన అసంతృప్తి కొద్ది రోజుల్లోనే తారాస్దాయికి చేరుకున్నది. అది ఉద్యమ రూపం దాల్చింది. ఇక అప్పటి నుంచి కేసిఆర్ తెలంగాణ సాదించే వరుకు సాగింది. కాని ఒక్క కేసిఆర్ హయాంలోనే పద్నాలుగు సంవత్సరాల పాటు నిరంతరం అలుపు లేని తెలంగాణ పోరాటం జరిగింది. మహాత్మా గాంధీ తన ఉద్యమ ప్రస్తానాన్ని ఎలా మొదలు పెట్టారో అలాగే రైతు ఉద్యమాలతో మొదలు పెట్టి అహింసా వాదంతో తెలంగాణ సాధించిన కారణ జన్ముడు కేసిఆర్. అలాంటి నాయకుడు యుగానికి ఒక్కరు జన్మిస్తారు. అసలు తెలంగాణ రాష్ట్రం సాధన అనేది ఎంత కష్టమైందనేది ఆ తరంలో తెలంగాణ కోసం ఆత్మశుద్దిగా పోరాటం చేసిన వాళ్లకు మాత్రమే తెలుసు. డిసెంబర్ 9 తెలంగాణ ప్రకటన తర్వాత తెలంగాణ ఉద్యమంలోకి దూరిన వారికి ఏం తెలుసు. మొదట జెండా ఎత్తిన వారికి మాత్రమే ఉద్యమ స్ఫూర్తి వుంటుంది. తెలంగాణ వస్తుందన్న నమ్మకం కేసిఆర్ కల్పించిన తర్వాత కలిసి వచ్చిన స్వార్ధ రాజకీయ శక్తులకు తెలంగాణ విలువ తెలియదు. తెలంగాణ ఉద్యమ విలువ తెలియదు. తెలంగాణ అస్థిత్వం గురించి తెలియదు. తెలంగాణ ఆత్మ గౌరవం ఎంత గొప్పదో అసలే తెలియదు. తెలంగాణ స్వేచ్ఛను పొందిన తర్వాత కూడా పరాయి నాయకులకు బానిసలుగా బతకడం తెలిసిన వారికి తెలంగాణ గురించి ఏమీ తెలియదు. కేసిఆర్ శకాన్ని చూసి వాళ్లు తట్టుకోలేరు. కేసిఆర్ చరిత్ర ఆనవాళ్లు వాళ్ల కళ్ల ముందు కదలాడుతుంటే ఓర్చుకోలేరు. పచ్చి తెలంగాణ వ్యతిరేకులు తెలంగాణ రావడమే ఇష్టం లేనివాళ్లు. తెలంగాణ కల నెరవేరితే కలలో కూడా నిద్రపోలేదు. కడుపు నిండా సమైక్య వాదం నింపుకొని, పైకి తెలంగాణ అని గర్వంగా ఎలుగెత్తి చాటలేని దద్దమ్మల మూలంగానే ఇంకా తెలంగాణ కన్నీరు పెడుతోంది. అయినా తెలంగాణ నిండా కేసిఆర్ అనే రక్షణ కవచం వుంది. తెలంగాణలో సీమాంధ్రకు చెందిన నాయకుల విగ్రహాల ప్రతిష్ట మళ్లీ మొదలైంది. సీమాంధ్ర నేతల మోచేతి నీళ్లకు అలవాటు పడిన వాళ్లు చేస్తున్న పనికి తెలంగాణ సలసల కాగుతోంది. ఏపిలో యుగ పురుషులు, శక పురుషులు లేరు. అందరూ సాదారణ పురుషులే. ఆంద్రా ప్రజల కోసం పోరాటాలు చేసిన నాయకులు ఎవరూ లేరు. ఆ ప్రాంత అస్థిత్వం ఎక్కడా దెబ్బతిన్నది లేదు. అందుకోసం ప్రయత్నం చేయాల్సిన అవసరం ఎవరికీ వచ్చింది లేదు. కాని తెలుగు ఆత్మగౌరవం అంటూ ఎన్టీఆర్ పేరు చెప్పడం అనేది మిద్య. తెలుగు ఆత్మగౌరవం అనేది ఒకరు ఇస్తే వచ్చేది కాదు. ఒకరితో వచ్చిందికాదు. కేసిఆర్ లాగా ఒక తెలంగాణ ప్రాంతానికి స్వాతంత్ర్యం తెచ్చిన నాయకుడు ఎన్టీఆర్ కాదు. కేసిఆర్ ఒక చరిత్రే కాదు. తెలంగాణకు జాగ్రఫీని సృష్టించిన నాయకుడు. తెలంగాణ ఉన్నంత కాలమే కాదు, ఈ భూమి వున్నంత కాలం కేసిఆర్ కీర్తి వుంటుంది. ఎన్టీఆర్ ఒక సినిమా నటుడు మాత్రమే. ఆయన విగ్రహాలు తెలంగాణలో పెట్టుకుంటే వచ్చే స్ఫూర్తి ఏమీ లేదు. ఎన్టీఆర్‌కు పోరాటాలా చరిత్ర లేదు. ఉద్యమ ప్రస్తానం అసలే లేదు. రాజకీయ ప్రవేశం కోసం ప్రయత్నం చేసిన ఎన్టీఆర్‌ను ఆనాడు ఎవరూ పట్టించుకోలేదు. దాంతో ఆయన పార్టీ పెట్టారు. గెలిచారు. ఓపెన్ మార్కెట్‌లో బియ్యం ధర రూ.4కు వున్న రోజుల్లో రూ.2కిలో ఇచ్చి పేదల దేవుడు అని కీర్తింపజేసుకున్నారు. ఎన్టీఆర్ పాలించిన కాలంలోనే ఆయనపై వచ్చిన సినిమాలు అన్నీ ఇన్నీ కాదు. యుగ పురుషుడే అయితే ఐదేళ్లకు ఎన్టీఆర్‌ను ఎందుకు జనం ఓడించారు. తెలంగాణ వెనుకబాటు నుంచి విముక్తి చేయలేదు. తెలంగాణ రైతుల నడ్డి విరిచిన నాయకుడు ఎన్టీఆర్. హార్స్ పవర్‌కు రూ.50 చొప్పున ఆ రోజుల్లోనే వసూలు చేసిన పాలకుడు ఎన్టీఆర్. అలాంటి నాయకుడు తెలంగాణకు ఎలా స్ఫూర్తి దాత అవుతారు. ఆయనను చూసి ఎవరు స్ఫూర్తి పొందాలి. స్ఫూర్తి దాత, ప్రదాత అంటే కేసిఆర్. ఆయనను చూసి ఎన్నొ నేర్చుకోవచ్చు. తెలంగాణ నేలన వున్న సుగుణాలన్నీ కేసిఆర్‌లో వున్నాయి. ఎన్టీఆర్ సినిమాల్లో తెరమీద పాత్రలు వేస్తే, కేసిఆర్ ప్రజా క్షేత్రంలో అనేక రూపాలలో తెలంగాణ సాదనను నడిపించారు. రెండు గంటల సినిమాలకు ఎన్టీఆర్ పరిమితమైన నటుడు. పద్నాలుగేళ్ల నిరంతరం అలుపులేని పోరాటం సాగించిన మహా నాయకుడు కేసిఆర్. అలాంటి కేసిఆర్ తెలంగాణకు దేవుడు. తెలంగాణ కోసం ఎంతోమంది ఉద్యమాలు చేశారు. పోరాటాలు చేశారు. కాని రాజ్యంతో కొట్లాడలేక వదిలేశారు. కేంద్రం ఒత్తిని తట్టుకోలేక పదవుల కోసం పాకులాడారు. తెలంగాణ కాడి కింద పడేశారు. రాజకీయ నాయకులు తెలంగాణ గొంతును సవరించుకోలేకపోయినా, కవులు, కళాకారులు, జర్నలిస్టులు మాత్రం తెలంగాణను మోస్తూనే వచ్చారు. తెలంగాణ వాదాన్ని సజీవంగా వుంచారు. 2000లో అందరూ కలిసి తెలంగాణ వాదాన్ని కేసిఆర్ చేతిలో పెట్టారు. ఆ పదాన్ని నోటి నిండా పలుకుతూ, ఆ జెండాను భుజం మీద మోస్తూ పద్నాలుగు సంవత్సరాల పోరాటం చేసిన తెలంగాణ సాదించిన సారధి కేసిఆర్. తెలంగాణ సాధనలో అనేక రకాల రూపాలను ఆవిష్కరించారు. తెలంగాణ తెచ్చిన తర్వాత ఎన్ని రకాల సంక్షేమ పధకాలు అమలు చేశారో...ఉద్యమ సమయంలో అన్ని రకాల పోరాటాల స్వరూపాలను కూడా ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమాన్ని ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, దీక్షలు, రిలే నిరాహార దీక్షలు, ఆమరణ నిరాహార దీక్షలు, పెన్ డౌన్ కార్యక్రమాలు, గులాబీ పువ్వులు చేతిలో పెట్టడం, వంటా వార్పులు, మిలియన్ మార్చులు, రైల్ రోకోలు, పాదయాత్రలు. ఇలా సమయాన్ని బట్టి అహింసాయుతమైన తెలంగాణ ఉద్యమాన్ని నిర్వహించిన నాయకుడు కేసిఆర్. ఉద్యమాలతో తెలంగాణ సాధన సరిపోదని, రాదని రాజకీయ చాణక్యంతోనే సాధించాలని తెలంగాణ రాష్ట్రసమితితో అటు ఎన్నికలు, ఇటు ప్రజా క్షేత్రంలో పోరాటాలు ఆవిష్కరించి తెలంగాణ సాధించిన ఈ తరం శకపురుషుడు కేసిఆర్. అంతే కాని తెలంగాణ నడి బొడ్డున యుగ పురుషులంటూ కట్టు కధలతో ఇతరుల విగ్రహాలతో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే మళ్లీ తెలంగాణ సమాజం మేలుకోవాల్సి వస్తుంది. కేసిఆర్ ఒక్కసారి గొంతు సవరిస్తే చాలు..పక్క రాష్ట్ర నాయకులు పారిపోవాల్సిందే.

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



# నేటిధాత్రి ®

తెలుగు వార్త పత్రిక

22ND ANNIVERSARY



ఆదివారం 31-05-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 22 సంచిక : 57 రూ॥ 6.00




## మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను

- ఉచిత విద్యుత్ ఆపేసినా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- లేకుంటే బీఆర్ఎస్ రాజకీయాల నుంచి తప్పుకుంటుందా
- రైతుల ముసుగులో లబ్ధికి కేసీఆర్ రాజకీయ ఎత్తుగడలు
- ధాన్యం కొరుగోళ్లలో కేంద్రం తీరు దుర్మార్గం
- కొనకపోతే బీజేపీ ఎంపిల ఇళ్లముందు ధాన్యం పోస్తాం
- హరీష్‌రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదు
- మహేశ్ గౌడ్‌ది నాది విన్నింగ్ కాంబినేషన్
- మీడియా చిట్‌చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో రైతులకు అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసినా తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదే సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరించగలదా అని ప్రశ్నిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

### రైతుల ముసుగులో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నాలు

రైతుల సమస్యల పేరుతో కేసీఆర్ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రైతుల సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గత పదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే నిర్ణయాలను తీసుకుంటుంటే వాటిపై అపోహలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

04లో

# పట్టణ పేదలకు పెద్దన్న సీఎం రేవంత్‌రెడ్డి కానుక







- తొలి విడతగా లక్ష, మలి విడత మరో లక్ష ఇళ్ల నిర్మాణం
- ఏడాదిలోగా లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక
- పేదవాని గుమ్మం వద్దకు ప్రజా ప్రభుత్వ పథకాలు
- ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలకు శంకుస్థాపన
- రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, నేటిధాత్రి:
పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార మరియు పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. పేద ప్రజలు తమ ఉపాధిని కోల్పోకుండా, ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల పరిధిలోనే అన్ని ఆధునిక సౌకర్యాలతో కూడిన ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి అందజేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం పట్టణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరచేందుకు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోందని పేర్కొన్నారు. శనివారం బంజారాహిల్స్‌లో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల సముదాయానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, మహ్మద్ అజారుద్దీన్‌లతో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు.

### లక్ష ఇళ్లతో ప్రారంభం... మరో లక్షకు ప్రణాళిక

హైదరాబాద్ మహానగర పరిధిలో తొలి విడతగా మంజూరు చేసిన లక్ష ఇందిరమ్మ ఇళ్లకు త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ఇళ్ల నిర్మాణాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని ఏడాది లోపే పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. మొదటి విడతలో లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిన వెంటనే రెండో విడతలో మరో లక్ష ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసాన్ని కల్పించడమే ప్రభుత్వ సంకల్పమన్నారు.

### పేదలను నగరాలకు దూరం చేయం

గత ప్రభుత్వాల మాదిరిగా నగరాలకు దూరంగా, ఉపాధి అవకాశాలకు దూరంగా పేదలను తరలించే విధానం తమ ప్రభుత్వంలో ఉండదని మంత్రి స్పష్టం చేశారు. గతంలో 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో ఇళ్లు నిర్మించడం వల్ల పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక ప్రత్యేక యూనిట్‌గా పరిగణించి, ఆ ప్రాంత ప్రజలకు అదే నియోజకవర్గ పరిధిలో ఇళ్లు నిర్మించి అందిస్తామని చెప్పారు. దీనివల్ల వారు తమ ఉపాధి, పిల్లల విద్య, ఆరోగ్య సేవలను కోల్పోకుండా జీవనం కొనసాగించగలరని వివరించారు.

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కానుక

పట్టణ పేదలకు అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందిస్తున్న అమూల్యమైన కానుక అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కోసం ఎదురుచూస్తున్న వేలాది కుటుంబాల కలలను నిజం చేసే కార్యక్రమంగా ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం నిలవనుందని తెలిపారు. పేద ప్రజల అవసరాలను గుర్తించి వారి జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.

### పేదవాని గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలు

ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమం పేదవాని గుమ్మం వద్దకే చేరేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు పదేపదే తిరగాల్సిన అవసరం లేకుండా సేవలను సరళీకృతం చేస్తున్నామని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు అన్ని శాఖల్లో సంస్కరణలు అమలు చేస్తున్నామని వెల్లడించారు.

### ఒకే చోట అన్ని ప్రభుత్వ సేవలు

స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, సర్వే, భూ రికార్డులు తదితర శాఖలకు సంబంధించిన సేవలను ఒకే చోట అందించేందుకు ఇంటిగ్రేటెడ్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సమీకృత కార్యాలయాల ద్వారా ప్రజలకు సమయం, ఖర్చు రెండూ ఆదా అవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాల పనితీరును ఆధునికీకరించి, కార్పొరేట్ స్థాయి సేవలను ప్రజలకు అందించేందుకు ఈ నిర్మాణాలు దోహదపడతాయని చెప్పారు.

### కార్పొరేట్ తరహాలో రిజిస్ట్రేషన్ సేవలు

జీహెచ్ఎంసీ పరిధిలోని 13 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆధునిక సదుపాయాలతో కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు మెరుగైన వసతులు, వేగవంతమైన సేవలు, పారదర్శక వ్యవస్థ అందుబాటులోకి వస్తాయని చెప్పారు.
రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవినీతికి తావులేకుండా డిజిటల్ విధానాలను మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

### ప్రభుత్వ ఖజానాపై భారం లేకుండా నిర్మాణాలు

ఈ నిర్మాణాల కోసం ప్రభుత్వ నిధులపై అదనపు భారం పడకుండా పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య పద్ధతిలో ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని మంత్రి వివరించారు. నిర్మాణ రంగంలో అనుభవం ఉన్న ప్రముఖ సంస్థలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా నాణ్యమైన నిర్మాణాలు, వేగవంతమైన పనులు సాధ్యమవుతాయని చెప్పారు.

### ఫినిక్స్ సంస్థ ఆధ్వర్యంలో భారీ నిర్మాణం

బంజారాహిల్స్‌లో నిర్మించనున్న సమీకృత భవన సముదాయాన్ని ఫినిక్స్ సంస్థ సుమారు 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అత్యాధునిక సదుపాయాలతో కూడిన ఈ భవనం కొద్ది నెలల్లోనే ప్రజలకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

### ఉపాధి, వ్యాపార అవకాశాలకు ఊతం

బంజారాహిల్స్ సమీకృత భవనంలో ఎస్.ఆర్. నగర్, బంజారాహిల్స్, గోల్కొండ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు డీఐజీ కార్యాలయం, రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యాలయాల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు పరిసర ప్రాంతాల్లో వ్యాపార కార్యకలాపాలు కూడా అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు.

### ముస్లిం సోదరుల ప్రార్థనలకు ప్రభుత్వం అండ

ఈ ప్రాంతంలో దశాబ్దాలుగా నమాజ్ నిర్వహిస్తున్న ముస్లిం సోదరుల విశ్వాసాలను గౌరవిస్తూ, ప్రతి సంవత్సరం రెండు సార్లు నమాజ్ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గౌరవించడమే ప్రజా ప్రభుత్వ విధానమని చెప్పారు.

### పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షత వహించగా, ఎంపీ అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, స్టాంపులు మరియు రిజిస్ట్రేషన్ల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, పలువురు ఉన్నతాధికారులు,

## బీఆర్ఎస్ నేతలవి దుర్మార్గపు ఆలోచనలు

- అందులో భాగంగానే బాల్క సుమన్ వ్యాఖ్యలు
- బీఆర్ఎస్ రాజకీయ సంస్కృతిపై మండిపడ్డ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



హైదరాబాద్, నేటిధాత్రి:
బీఆర్ఎస్ పార్టీ రాజకీయ డ్రామాలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బలయ్యారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఆరోపించారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న వివాదాస్పద వ్యాఖ్యలు, ఉపయోగిస్తున్న భాష రాజకీయ విలువలకు విరుద్ధమని ఆయన తీవ్రంగా విమర్శించారు.

### బాల్క సుమన్‌తో మాట్లాడించిన వారు ఎవరు?

శనివారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన దయాకర్, బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యల వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించాలని డిమాండ్ చేశారు. రైల్వే పట్టాలు కోయాలని, దాడులు చేయాలని పిలుపునివ్వడం పూర్తిగా బీఆర్ఎస్ సంస్కృతేనని పేర్కొన్నారు. ఈ తరహా రాజకీయాలను ప్రోత్సహించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.

### కేసీఆర్ రాజకీయ పాఠాలే ఇవి

ఇలాంటి ఆలోచనలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ విధానంలో భాగమని అద్దంకి దయాకర్ ఆరోపించారు. కేసీఆర్ తన రాజకీయ శైలిని కేటీఆర్‌కు నేర్పించారని, అదే విధానాన్ని కేటీఆర్ బాల్క సుమన్‌కు బోధించారని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టడం, ఉద్రిక్త పరిస్థితులు సృష్టించడం బీఆర్ఎస్ రాజకీయ అజెండాగా మారిందన్నారు.

### తప్పులు చేస్తే జై తెలంగాణ అంటారా?

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లోపాలు, ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తితే వాటిని తెలంగాణ భావోద్వేగాలతో కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని దయాకర్ ఆరోపించారు. తప్పులు చేసినప్పుడు వాటికి సమాధానం చెప్పాల్సిన బదులు "జై తెలంగాణ" అంటూ ప్రజల దృష్టి మళ్లించడం బీఆర్ఎస్ నేతల అలవాటైందన్నారు.

### రైతులు, ఉద్యోగులను రెచ్చగొట్టే ప్రయత్నం

ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగ సంఘాలు, రైతులను రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొందాలనే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అధికార దాహంతో బీఆర్ఎస్ నాయకులు ఎంతకైనా దిగజారేందుకు సిద్ధంగా ఉన్నారని ఆరోపించారు.

### పోలీసుల విచారణ కోరిన దయాకర్

బాల్క సుమన్‌తో ఇలాంటి వ్యాఖ్యలు చేయించిన వారు ఎవరో పోలీసులు సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలకు స్వస్తి పలకాలని, బీఆర్ఎస్ నాయకులు దుర్మార్గపు ఆలోచనల నుంచి బయటకు రావాలని సూచించారు.

# పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యం

- సీబీఎస్ఈ మూల్యాంకన లోపాలు దారుణం
- అసమర్థ వ్యవస్థలపై దేశాన్ని నిర్మించలేమన్న కేటీఆర్



హైదరాబాద్, నేటిధాత్రి:
దేశవ్యాప్తంగా సీబీఎస్ఈ 12వ తరగతి ఫలితాలపై తలెత్తిన వివాదం విద్యార్థులు, తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డిజిటల్ మూల్యాంకనంలో జరిగిన లోపాల కారణంగా లక్షలాది మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

### 18.5 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం

మార్కుల తారుమారు, మూల్యాంకన లోపాల కారణంగా దేశవ్యాప్తంగా సుమారు 18.5 లక్షల మంది విద్యార్థులు ప్రభావితమయ్యారని కేటీఆర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే విధంగా వ్యవస్థ పనిచేయడం ఆందోళనకరమన్నారు.

### మళ్లీ గుర్తొచ్చిన గ్లోబరేనా వివాదం

ఈ వ్యవహారం తెలంగాణలో 2019లో జరిగిన ఇంటర్మీడియట్ ఫలితాల వివాదాన్ని గుర్తుకు తెస్తోందని కేటీఆర్ అన్నారు. అప్పట్లో విద్యార్థుల జీవితాలను అస్తవ్యస్తం చేసిన గ్లోబరేనా సంస్థ పేరును మార్చుకుని ఇప్పుడు సీబీఎస్ఈలో పెద్ద కాంట్రాక్ట్ పొందడం ఆశ్చర్యకరమని విమర్శించారు.

### బాధ్యులపై చర్యలు తీసుకున్నాం

2019లో తెలంగాణ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి నిపుణులతో కమిటీ ఏర్పాటు చేసిందని కేటీఆర్ గుర్తుచేశారు. కమిటీ నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు సంస్థపై చట్టపరమైన చర్యలు కూడా చేపట్టామని వివరించారు.

### కేంద్ర ప్రభుత్వంపై ప్రశ్నలు

చెడ్డ చరిత్ర కలిగిన సంస్థకు సీబీఎస్ఈ ఎలా బాధ్యతలు అప్పగించిందని కేటీఆర్ ప్రశ్నించారు. కేవలం పేరు మార్చడం ద్వారా గత తప్పులను దాచి పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం క్షమించరాని చర్య అని అన్నారు.

### విద్యార్థులకు అండగా బీఆర్ఎస్

విద్యార్థులకు పూర్తి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని కేటీఆర్ ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర విద్యాశాఖ మంత్రి ఈ వివాదంపై దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# సిజేరియన్ ఆపరేషన్లలో తెలంగాణ టాప్..

## జాతీయ ఆరోగ్య శాఖ ఆందోళనకర రిపోర్టు



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో ఆందోళనకర రీతిలో సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి అనేక ఆరోగ్య సూచీల్లో తెలంగాణ ఉత్తమ ప్రదర్శన ఇస్తున్నా.. సీ సెక్షన్ ఆపరేషన్లు మాత్రం కలవరపరుస్తున్నాయి. దేశవ్యాప్తంగా సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య తెలంగాణలోనే ఎక్కువగా ఉనన్నది. ఇక్కడ జరుగుతున్న పది డెలివరీల్లో.. ఆరుగురికి ఆపరేషన్ జరుగుతున్నట్లు నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఫలితాల ద్వారా వెల్లడైంది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆ గణాంకాలను రిలీజ్ చేసింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 98.8 శాతం ప్రసూతీ కేసులు ఆస్పిటళ్లలోనే జరుగుతున్నాయని, ఇది జాతీయ సగటు 90.6 శాతం కన్నా ఎక్కువే అని, కానీ 62. 2 శాతం డెలివరీలు మాత్రం సిజేరియన్ సెక్షన్ ద్వారా జరుగుతున్నట్లు ఆరోగ్య శాఖ పేర్కొన్నది. ఇది జాతీయ సగటు 27.2 శాతం కన్నా రెట్టింపు అని ఆరోగ్య శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.
ఎన్ఎఫ్‌హెచ్ఎస్-5 ఆరోగ్య సర్వే సమయంలో తెలంగాణలో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య 607 శాతంగా ఉంది. 2019 నుంచి 2021 మధ్య కాలంలో ఆ సర్వే జరిగింది. అయితే గత సర్వేకు.. తాజా సర్వేతో పోలిస్తే, కేవలం తెలంగాణలో మాత్రమే సిజేరియన్ల సంఖ్య రెట్టింపు అయ్యింది. మరే రాష్ట్రంలో కానీ, కేంద్ర పాలిత ప్రాంతంలో కానీ ఈ సంఖ్య పెరగలేదు. ఆంధ్రప్రదేశ్‌లో సిజేరియన్ల సంఖ్య 52.2 శాతంగా ఉంది. ఇక నాగాలాండ్‌లో అత్యల్పంగా 13.2 శాతంగా ఉన్నట్లు ఆరోగ్య శాఖ పేర్కొన్నది.
ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో జరుగుతున్న ఆపరేషన్ల గురించి కూడా సర్వేలో వెల్లడించారు. తెలంగాణలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో 83.9 శాతం డెలివరీలు సిజేరియన్ పద్ధతుల్లో జరుగుతున్నాయని, ఇక జాతీయ సగటు కేవలం 54.1 శాతం మాత్రమే ఉన్నట్లు ఆరోగ్య శాఖ చెప్పింది. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా 48.1 శాతం సిజేరియన్ రేట్ ఉన్నట్లు పేర్కొన్నది. ఇక జాతీయ సగటు 16.9 శాతం మాత్రమే. ప్రెగ్నెన్సీ వచ్చిన మొదటి 100 రోజుల వరకు తెలంగాణలోని 81 శాతం మంది గర్భిణులు ఐరన్, ఫోలిక్ యాసిడ్ ట్యాబ్‌లెట్లు వాడినట్లు రిపోర్టులో తెలిపారు. ఇక జాతీయ సగటు కేవలం 54.9 శాతం మాత్రమే ఉంది.

## తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు

**జూన్ 4న అఖిలపక్ష భేటీ జరపాలని నిర్ణయం**

- కేశవరావు కమిటీ తొలి భేటీలో కీలక నిర్ణయాలు
- ఉద్యమకారుల వివరాల సేకరణకు కార్యాచరణ
- అమరవీరుల కుటుంబాలకు ప్రాధాన్యం
- ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వర్గానికి గుర్తింపు
- పారదర్శకంగా అర్హుల జాబితా తయారీ
- ఉద్యమ సేవలకు తగిన గౌరవం కల్పించడమే లక్ష్యం
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ చర్యలు
- ఉద్యమ త్యాగాలకు గుర్తింపే కమిటీ ప్రధాన ఉద్దేశం



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ఉద్యమంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న వారి వివరాలను సమగ్రంగా సేకరించి అర్హుల జాబితా రూపొందించేందుకు కమిటీ కార్యాచరణ ప్రారంభించింది. దీనిపై సంబంధిత శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

### అమరవీరుల కుటుంబాలకు ప్రాధాన్యం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. వారి సేవలను గుర్తించి తగిన గౌరవం అందించే దిశగా చర్యలు చేపట్టనుంది.

### ఉద్యమంలో పాల్గొన్న ప్రతి వర్గానికి గుర్తింపు

మేధావులు, కళాకారులు, రచయితలు, ఉద్యోగులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ఆర్టీసీ మరియు సింగరేణి కార్మికులు సహా ఉద్యమానికి సహకరించిన ప్రతి వర్గాన్నీ గుర్తించి గౌరవించాలనే లక్ష్యంతో కమిటీ పనిచేస్తోంది.

### పారదర్శకంగా అర్హుల జాబితా తయారీ

ఉద్యమకారుల ఎంపిక ప్రక్రియలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శక విధానంలో అర్హుల జాబితా రూపొందించాలని కమిటీ నిర్ణయించింది. ఇందుకోసం అన్ని వర్గాల అభిప్రాయాలు స్వీకరించనుంది.

### ఉద్యమ సేవలకు తగిన గౌరవం

తెలంగాణ రాష్ట్ర సాధనలో విశేష కృషి చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం తరపున తగిన గుర్తింపు, గౌరవం అందేలా సిఫార్సులు చేయాలని కమిటీ నిర్ణయించింది. వారి త్యాగాలు, సేవలను భావితరాలకు చాటిచెప్పే విధంగా చర్యలు చేపట్టనుంది.



# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక



ఆదివారం 31-05-2026 పేజీలు : 12 CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES సంపుటి : 22 సంచిక : 57 రూ॥ 6.00


# అక్షర ప్రగతి పథంలో నేటిధాత్రి




పదునైన అక్షరం, చైతన్యవంతమైన భావం ఈ సమాజానికి అవసరమని, కలం, కాగితం చేత పట్టుకొని **"నేటిధాత్రి"** పత్రిక ప్రయాణం ప్రారంభించి **"22 వసంతాలు".**

తెలంగాణా ఉద్యమాన్ని తన భుజాల మీద మోస్తూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతోంది. ఉద్యమం కోసం **"నేటిధాత్రి"** తనకు తాను సర్వస్వం త్యాగం చేసింది.

తెలంగాణా కోసం, ఆత్మ గౌరవం కోసం, తెలంగాణ ఆస్తిత్వం కోసం **"నేటిధాత్రి"** అక్షర పోరాటం ముందుండి చేసింది. ఇప్పుడు తెలంగాణ వికాసం కోసం సాగుతోంది. ప్రజా గొంతుకై నిటారుగా నిలబడుతోంది.

అందుకు **"నేటిధాత్రి"** కోసం ఎందరో **ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, స్నేహితులు, సన్నిహితులు, సమాజ సేవకులు, మేధావులు, వ్యాపారులు, అధికారులు** ఇలా అన్ని రంగాలకు చెందిన సేవాతత్పరులు చేయూతనందిస్తూ వచ్చారు. వాళ్లందరికీ అక్షరాభివందనాలు, కృతజ్ఞతలు.

ఈ మీ సహకారం ఎల్లప్పుడూ ఉండాలని **"నేటిధాత్రి"** పత్రిక **22 వసంతాల** సందర్భంగా మీ అందరి సహాయ, సహకారాలతో మరింత ముందుకు సాగేలా ఆశీర్వదించాలని...

**అక్షర వేడుకతో...**



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
CEO, నేటిధాత్రి9 TV
డైరెక్టర్, ధాత్రి గ్రూప్స్

మీ
**కట్టా రాఘవేందర్ రావు**
చీఫ్ ఎడిటర్ - నేటిధాత్రి
CEO, ధాత్రి గ్రూప్స్



- రియల్ ఎస్టేట్ ఒక్కటే వచ్చు అని చెప్పిన గుంపు మేస్త్రీ ఆ వ్యాపారాన్ని ఊడగొట్టాడు
- గుంపు మేస్త్రీ పై పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలి
- మొయినాబాద్ లో టీఆర్ఎస్ జెండా ఎగురవేసిన కవిత

# మేం అధికారంలోకి వచ్చాక 111 జీవో ఎత్తివేస్తాం

-రియల్ ఎస్టేట్ ఒక్కటే వచ్చు అని చెప్పిన గుంపు మేస్త్రీ ఆ వ్యాపారాన్ని ఊడగొట్టాడు





హైదరాబాద్ , నేటిధాత్రి:
తమ పార్టీ అధికారంలోకి రాగానే 111 జీవో ఎత్తివేస్తామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత చెప్పారు. ఈ జీవో కారణంగా బాధపడుతున్న వారందరికీ ఉపశమనం కలిగిస్తామన్నారు. టీఆర్ఎస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం మొయినాబాద్ లో ఏర్పాటు చేసిన జెండా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. మొయినాబాద్ లో అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించిన...అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ లక్ష్యాల కోసం తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యాలను గత 12



ఏళ్లలో సాధించుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను పరిరక్షించుకునేందుకే టీఆర్ఎస్ ఏర్పాటు చేశామన్నారు.

### 111 జీవో ఎత్తివేస్తాం

111 జీవో పరిధిలోని బాధితులందరికీ టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత గుడ్ న్యూస్ చెప్పారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ఈ జీవో ను ఎత్తివేస్తామన్నారు. ఇతర పార్టీల మాదిరిగా తాము మోసం చేయమని స్పష్టం చేశారు. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ లు ఇక్కడి ప్రజలకు 111 జీవో ఎత్తేస్తామంటూ మాట ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేశాయని విమర్శించారు. 111 జీవో పరిధిలో ఉన్న 120 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. చుట్టు పక్కల భూములు ఎకరాకు వంద కోట్లకు పైగా ధర పలుకుతుంటే 111 జీవో పరిధిలోని ప్రజలు మాత్రం తమ భూములను ఎక్కువ రేటుకు అమ్ముకోలేని పరిస్థితి ఉందన్నారు. పిల్లల పెళ్లిళ్ల కోసం ఒక పావు ఎకరం భూమి అమ్మితే సమస్యలు తీరుతాయని భావించినప్పటికీ ఈ జీవో అడ్డంకిగా ఉందన్నారు. గుంపు మేస్త్రీ తనకు రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒక్కటే తెలుసని చెప్పి అధికారంలోకి వచ్చాక ఆ వ్యాపారాన్ని ఊడగొట్టారని మండిపడ్డారు. చేవెళ్ల, మొయినాబాద్ లో ఎక్కువగా రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉంటారని వారికి మేలు చేసేలా ఈ ప్రభుత్వం ఏమీ చేయటం లేదని మండిపడ్డారు. అందుకే గుంపుమేస్త్రీ పై పోరాటానికి ఈ ప్రాంత ప్రజలంతా ముందుకు రావాలని కోరారు.


### హక్కుల పరిరక్షణకే కొత్త పార్టీ

తెలంగాణ వచ్చాక అన్ని సమస్యలు తీరుతాయని భావిస్తే అలా జరగలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఏ లక్ష్యాల కోసం రాష్ట్రం సాధించుకున్నామో ఆ లక్ష్యాలతో పాటు తెలంగాణ హక్కుల పరిరక్షణ కోసమే తాము కొత్త రాజకీయ శక్తిగా పుట్టుకొచ్చామన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆడబిడ్డల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఆడబిడ్డగా, మీ సోదరిగా మీకు ఏం కావాలో నాకు తెలుసు. తప్పకుండా మన పార్టీ ద్వారా మహిళలకు మంచి జరుగుతుందని హామీ ఇస్తున్నా అన్నారు. అదే విధంగా యువత కోసం ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. సృజనాత్మక ఆలోచన కలిగిన యువత వ్యాపారం చేసేలా ప్రోత్సహించేందుకు వారికి ఎలాంటి గ్యారంటీ లేకుండా 2 లక్షల నుంచి 20 కోట్ల వరకు రుణాలు మంజూరు చేస్తామన్నారు. చేవెళ్ల, మొయినాబాద్ నుంచి మైనార్టీలు పెద్ద ఎత్తున చేరటంతో ఈ ప్రాంతంలో పార్టీ మరింత బలపడిందని చెప్పారు. ఇక్కడి గంగా జమున తెహజీబ్ ను చెడగొట్టే ప్రయత్నం చేస్తున్న వాళ్లకు బుద్ధి చెప్పాల్సిన అవసరముందని కవిత అన్నారు.

### చిలుకూరు బాలాజీ స్వామి వారి దర్శనం

అంతకుముందు కవిత చిలుకూరు బాలాజీ స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజాలు చేశారు. కొత్తగా ఏర్పాటు చేసిన తమ పార్టీకి స్వామి వారి ఆశీస్సుల కోసం వచ్చామని చెప్పారు. బాలాజీ ఆశీస్సులతో తెలంగాణ ప్రజల కోసం పోరాటం చేస్తామన్నారు. రాష్ట్రంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రైతులకు మంచి చేసే బుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇవ్వాలని స్వామి వారిని కోరుకున్నానని కవిత చెప్పారు. జెండా పండుగ కార్యక్రమం అనంతరం మొయినాబాద్ మండలం సొరంగల్ లో టీఆర్ఎస్ నాయకుడు సంతోష్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బస్ షెల్టర్ కు శంకుస్థాపన చేశారు.

# మోటర్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీచేయను



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణలో రైతులకు అందిస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిలిపివేసినా, వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేసినా తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇదే సవాల్‌ను బీఆర్ఎస్ స్వీకరించగలదా అని ప్రశ్నిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో సీఎం పలు రాజకీయ, పరిపాలనా అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

### రైతుల ముసుగులో రాజకీయ లబ్ధి కోసం ప్రయత్నాలు

రైతుల సమస్యల పేరుతో కేసీఆర్ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. రైతుల సంక్షేమంపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే గత పదేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయాల్సిందని అన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు మేలు చేసే నిర్ణయాలను తీసుకుంటుంటే వాటిపై అపోహలు సృష్టించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు.

### రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుంది

దేశంలోనే తొలిసారిగా రైతుల కోసం ప్రత్యేకంగా “రైతు డిస్కం” ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ వ్యవస్థ ఉపయోగపడుతుందని చెప్పారు. రైతు డిస్కం ద్వారా విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత పెరగడమే కాకుండా ప్రభుత్వానికి తక్కువ ధరలో విద్యుత్ సమకూరే అవకాశం ఉంటుందని వివరించారు. దీని ద్వారా రైతులకు అందించే సేవల నాణ్యత కూడా మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

### మీటర్లపై బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీ ఎప్పుడూ చెప్పలేదని సీఎం స్పష్టం చేశారు. అయినప్పటికీ బీఆర్ఎస్ రాజకీయ ప్రయోజనాల కోసం ఈ అంశాన్ని పదేపదే ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు పెడతామని ప్రకటించలేదని గుర్తు చేశారు. రైతుల్లో భయాందోళనలు సృష్టించడమే బీఆర్ఎస్ లక్ష్యంగా కనిపిస్తోందన్నారు.

### అప్పులపై హరీశ్ రావు అసత్య ప్రచారం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై హరీశ్ రావు చేస్తున్న విమర్శలను సీఎం ఖండించారు. తమ ప్రభుత్వం ఏడాదికి రూ.70 వేల కోట్ల అప్పు చేస్తే, గత ప్రభుత్వం చేసిన రూ.95 వేల కోట్ల అప్పులను తీర్చుతోందని చెప్పారు. రూ.54 వేల కోట్ల వరకు అప్పులు తీసుకుంటామని ముందుగానే ప్రకటించామని, ఎఫ్ఆర్‌బీఎం పరిమితులను దాటి ఎలాంటి అప్పులు చేయడం లేదని స్పష్టం చేశారు. అయితే గత ప్రభుత్వం చేసిన అప్పుల భారాన్ని మాత్రం ప్రజలు ఇప్పటికీ భరిస్తున్నారని వ్యాఖ్యానించారు.

### ధాన్యం కొనుగోలులో కేంద్రం వైఖరి దుర్మార్గం

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించడం తప్ప రైతుల నుంచి ఒక్క గింజ ధాన్యం కూడా కొనడం లేదని సీఎం మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రైతుల నుంచి వరి, జొన్న, మొక్కజొన్న పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తోందని చెప్పారు.
ఇప్పటివరకు 62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు వెల్లడించిన సీఎం, తడిచిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. సన్న వడ్లకు బోనస్ కూడా ఇస్తున్నామని తెలిపారు.

### ధాన్యం కొనకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు పోస్తాం

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీఎం డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీలు, నాయకులు ఢిల్లీకి వెళ్లి కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు.
ఒకవేళ కేంద్రం ధాన్యం కొనుగోలు చేయకపోతే బీజేపీ నేతల ఇళ్ల ముందు ట్రాక్టర్లతో ధాన్యం తీసుకెళ్లి పోస్తామని హెచ్చరించారు. రైతుల కష్టాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు.

### జల వివాదాలపై మహారాష్ట్ర వైఖరిపై అసంతృప్తి

అంతర్రాష్ట్ర జల వివాదాలను సహకార దృక్పథంతో పరిష్కరించాలని ప్రధాని మోదీ సూచిస్తున్నప్పటికీ, ప్రాణహిత ప్రాజెక్టుకు సంబంధించి మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టు అంశంపై చర్చించేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఈ అంశంపై ప్రయత్నాలు కొనసాగిస్తామని తెలిపారు.

### హరీశ్ రావుపై ఆసక్తికర వ్యాఖ్యలు

హరీశ్ రావు భవిష్యత్తు ఆయన చేతుల్లోనే లేదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. గతంలో ఆయన వైఎస్సార్ వద్దకు వెళ్లిన విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం ఎవరెవరితో మాట్లాడుతున్నారో తనకు తెలుసని కానీ వాటిని బహిర్గతం చేయబోనని అన్నారు. ఇటీవల పార్టీ సమావేశాన్ని వదిలి ఢిల్లీకి ఎందుకు వెళ్లారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ మధ్య రాజకీయ అవగాహన ఉందన్న అనుమానాలను కూడా వ్యక్తం చేశారు.

### గ్లోబరీనా సంస్థపై ఆరోపణలు

సీబీఎస్ఈ మూల్యాంకన వివాదంలో ప్రస్తావనకు వచ్చిన గ్లోబరీనా సంస్థపై కూడా సీఎం వ్యాఖ్యానించారు. ఆ సంస్థకు కేటీఆర్‌తో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ, పేరు మార్చుకున్నా గత చరిత్ర మారదన్నారు.
విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకునే సంస్థలకు బాధ్యతలు అప్పగించడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

### మహేశ్ గౌడ్‌తో విజయవంతమైన కాంబినేషన్

పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో తనది విజయవంతమైన రాజకీయ కాంబినేషన్ అని సీఎం పేర్కొన్నారు. తమ నాయకత్వంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాలు సాధించిందని గుర్తు చేశారు.
భవిష్యత్తులో కూడా ఇదే విజయపరంపర కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహేశ్ కుమార్ గౌడ్‌కు మంచి పదవి వచ్చే అవకాశముందని వ్యాఖ్యానించారు.

### అభివృద్ధే లక్ష్యం

జీహెచ్ఎంసీ ఎన్నికలపై ఇప్పుడే చర్చించాల్సిన అవసరం లేదని సీఎం అన్నారు. ఎన్టీఆర్ విగ్రహం చుట్టూ ప్రాంతీయ, కుల వివాదాలు సృష్టించడం బుద్ధిలేనితనమని వ్యాఖ్యానించారు.
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టిన వ్యక్తిని తానేనని గుర్తు చేశారు. తన దృష్టి పూర్తిగా అభివృద్ధి, పరిపాలన, ప్రజా సంక్షేమంపైనే ఉందని స్పష్టం చేశారు.

### 2034 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే

రాష్ట్ర రాజకీయాల్లో తాను 2034 వరకు చురుకుగా కొనసాగుతానని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. వివాదాలు, భావోద్వేగాలు, ప్రాంతీయత ఆధారంగా రాజకీయాలు చేయాలనే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు.
ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తమ ప్రభుత్వ ధ్యేయమని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# మోసపు హామీలతో గద్దెనెక్కి రైతులను దగా చేశారు

- కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్రంగా మోసపోయారు
- కేంద్రాన్ని విమర్శించడం తప్ప ప్రభుత్వం చేసిందేమీ లేదు
- మీడియా సమావేశంలో మండిపడ్డ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్, నేటిధాత్రి:
మార్పు పేరుతో తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తన అసమర్థతను కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు.

దళారులు, మిల్లర్ల చేతిలో రైతులు నలిగిపోతున్నారు

శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడిన కిషన్ రెడ్డి, తెలంగాణలో రైతులు దళారులు, రైస్ మిల్లర్లు మరియు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా రైతులు ఇక్కడ ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.
రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రులు ఏసీ గదుల్లో కూర్చుని కాలం గడిపారని, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు రైతుల వద్దకు వెళ్లి ఆందోళనలు ప్రారంభించాకే ప్రభుత్వం స్పందించిందని విమర్శించారు.

కేంద్రంపై నెపం నెట్టడం సరికాదు

ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలను కిషన్ రెడ్డి ఖండించారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయదని, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారానే కొనుగోలు జరుగుతుందని గుర్తు చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాలను దాచేందుకు కేంద్రంపై నిందలు మోపడం సరైంది కాదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రాన్ని లక్ష్యంగా చేసుకోవడం దురదృష్టకరమన్నారు.

రైతులతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రాజకీయాలు

రైతుల సమస్యలను కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా ఉపయోగించుకుంటున్నాయని కిషన్ రెడ్డి ఆరోపించారు. రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం కాంట్రాక్టులు, కమిషన్లు, భూదందాలపైనే దృష్టి కేంద్రీకరించిందన్నారు.
ఎవరు ఎంత కమిషన్ తీసుకున్నారు, ఎవరికెంత లాభం వస్తుంది అనే చర్చలే ప్రభుత్వంలో జరుగుతున్నాయని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

సన్న బియ్యం రైతులకు నష్టం

రాష్ట్రంలో పండుతున్న నాణ్యమైన సన్న బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు అధిక ధరలకు విక్రయించి, తక్కువ నాణ్యత కలిగిన బియ్యాన్ని తిరిగి తెచ్చి పేదలకు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఇది రైతులను, పేదలను ఒకేసారి మోసం చేయడమేనని అన్నారు.

ఆర్గానిక్ వ్యవసాయంపై దృష్టి అవసరం

ప్రపంచ మార్కెట్లలో పోటీ పడాలంటే రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పదేపదే ఆర్గానిక్ వ్యవసాయం గురించి చెబుతున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

కేంద్రం లక్ష్యాన్ని రాష్ట్రం పూర్తి చేయలేదు

ధాన్యం సేకరణ విషయంలో కేంద్ర ప్రభుత్వం పలుమార్లు గడువు పొడిగింపు ఇచ్చిందని కిషన్ రెడ్డి తెలిపారు. 52.24 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరా చేయాలని ఒప్పందం కుదిరినా ఇప్పటివరకు 51 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే అందించారని చెప్పారు.
రాష్ట్ర ప్రభుత్వం తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించకుండా కేంద్రాన్ని విమర్శించడం సరికాదని స్పష్టం చేశారు.

# రైతులకు వాతావరణ సూచనలు

తెలంగాణ వాతావరణ సలహా కార్యక్రమం ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

- రైతులకు ఖచ్చితమైన వాతావరణ సమాచారం
- కృత్రిమ మేధస్సుతో వ్యవసాయ సలహాలు
- లక్షలాది మంది రైతులకు ప్రయోజనం
- ఆధునిక సాంకేతికతతో వ్యవసాయానికి అండ
- డీఐఎల్ ఇండియా, ఎవిడెన్స్ యాక్షన్‌తో ఒప్పందం

హైదరాబాద్, నేటిధాత్రి:
వాతావరణ మార్పులు వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో రైతులకు సమయానుకూలంగా, ఖచ్చితమైన వాతావరణ సమాచారాన్ని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ సమాచారం రైతులు పంటల నిర్వహణలో సరైన నిర్ణయాలు తీసుకునేందుకు ఉపయోగపడనుంది.

### కృత్రిమ మేధస్సుతో వ్యవసాయ సలహాలు

కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత సాంకేతికతను వినియోగించి రైతులకు పంటల నిర్వహణ, వాతావరణ పరిస్థితులు, సాగు విధానాలపై శాస్త్రీయ సూచనలు అందించనున్నారు. దీనివల్ల వ్యవసాయంలో నష్టాలను తగ్గించడంతో పాటు దిగుబడులు పెరిగే అవకాశం ఉంది.



### లక్షలాది మంది రైతులకు ప్రయోజనం

ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది రైతులు నేరుగా లబ్ధి పొందనున్నారు. వాతావరణ హెచ్చరికలు, పంటల సంరక్షణ చర్యలు, వ్యవసాయ నిర్వహణ సూచనలు రైతులకు అందుబాటులోకి రానున్నాయి.

ఆధునిక సాంకేతికతతో వ్యవసాయానికి అండ

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడం ద్వారా రైతులకు క్షేత్రస్థాయిలో ఉపయోగపడే సమాచారాన్ని అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ఏసీబీకి చిక్కిన సైబర్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్

- రూ.4 లక్షల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టివేత
- ఇంట్లో భారీగా నగదు, బంగారం స్వాధీనం

హైదరాబాద్, నేటిధాత్రి:
సైబర్ నేరాలను అరికట్టాల్సిన పోలీసు అధికారే లంచం తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కిన ఘటన రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న బత్తుల మహేందర్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు.

### కేసులో ఇరికించకుండా ఉండాలంటే రూ.9 లక్షలు

ఒక సైబర్ మోసం కేసులో బాధితుడి కుటుంబ సభ్యులను ఇరికించకుండా ఉండాలంటే రూ.9 లక్షల లంచం ఇవ్వాలని ఇన్‌స్పెక్టర్ మహేందర్ డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ మొత్తంలో ఇప్పటికే రూ.5 లక్షలు వసూలు చేసిన మహేందర్, మిగిలిన రూ.4 లక్షల కోసం బాధితుడిపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు తెలిసింది.

### ఏసీబీ ఉచ్చులో చిక్కిన అధికారి

లంచాల వేధింపులతో విసిగిపోయిన బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. పక్కా ప్రణాళికతో శనివారం లంచం డబ్బు తీసుకుంటున్న సమయంలో అధికారులు మెరుపు దాడి నిర్వహించి మహేందర్‌ను పట్టుకున్నారు.

### ఇంట్లో సోదాలు

అరెస్ట్ అనంతరం ఇన్‌స్పెక్టర్ అధికారిక నివాసంలో ఏసీబీ



అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.13 లక్షల నగదు, బంగారు ఆభరణాలు, పలు ఆస్తి పత్రాలు స్వాధీనం చేసుకున్నారు.

### అక్రమ ఆస్తులపై లోతైన దర్యాప్తు

ఇన్‌స్పెక్టర్ మహేందర్ ఆస్తులపై మరింత లోతైన విచారణ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు. అతనికి సంబంధించిన బ్యాంకు ఖాతాలు, ఆస్తుల లావాదేవీలు, ఇతర ఆర్థిక వివరాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.

### ప్రత్యేక కోర్టులో హాజరు

లంచం కేసులో అరెస్టయిన మహేందర్‌ను నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరిచినట్లు అధికారులు తెలిపారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

**పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి**



**పరకాల, నేటిధాత్రి:** హనుమకొండ జిల్లా పరకాల మండలం వెల్లంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు,కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ యూత్ ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రావణ్ కుమార్,నాయకుడు ఐరబోయిన అజయ్‌తో పాటు పలువురు కార్యకర్తలు మాజీ అధ్యక్షుడు యాట వీరస్వామి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకొని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో అమలైన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను గుర్తించిన ప్రజలు తిరిగి పార్టీ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది నాయకులు,కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,గ్రామ పెద్దలు,యువజన నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి చలివేంద్రంలో మూడు రోజులుగా తాగునీరు బంద్

**రోగులు, వృద్ధులు, గర్భిణీల అవస్థలు: బీజేపీ పట్టణ అధ్యక్షుడు సందీప్ ఆవేదన**



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట పట్టణంలో నూతనంగా ఏర్పాటు కాటేసిన ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి ఆవరణలోని చలివేంద్రంలో గత మూడు రోజులుగా తాగునీరు లేక రోగులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ పట్టణ అధ్యక్షుడు గూడూరు సందీప్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వందలాది మంది రోగులు, వారి బంధువులు వివిధ ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తుంటారని, వేసవి తీవ్రత అధికంగా ఉన్న ఈ సమయంలో చలివేంద్రంలో శుద్ధమైన తాగునీరు అందుబాటులో లేకపోవడంతో రోగులు, వృద్ధులు, గర్భిణీలు, చిన్నారులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు బయట నుంచి నీరు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చలివేంద్రంలో తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఎండల తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరంగా శుద్ధమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వీడాలని గూడూరు సందీప్ విజ్ఞప్తి చేశారు.

## శ్రీ ప్రసన్న ఆంజనేయ దేవాలయానికి 100 స్టీల్ ప్లేట్ల విరాళం



**తాండూర్, నేటిధాత్రి:** తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ దేవాలయంలో ప్రతి నెల పౌర్ణమి సందర్భంగా నిర్వహించే అన్నవితరణ కార్యక్రమానికి గాను 100 స్టీల్ ప్లేట్లను శనివారం ఆలయ కమిటీకి అందజేశారు. ఆసిఫాబాద్‌కు చెందిన కీ.శే. బీరెల్లి రాజయ్య (రిటైర్డ్ టీచర్) జ్ఞాపకార్థంగా వారి కుమారులు బీరెల్లి శ్రీనివాస్,నరేందర్ ఈ ప్లేట్లను విరాళంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు ఒడ్నాల ఆనంద్, కామని శ్రీనివాస్,బియ్యల నిఖిల్, కుటుంబ సభ్యులు,గందేశ్రీ సత్యనారాయణ,కొంకుముట్టి సత్యనారాయణతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలి.

**రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ....దిగొండ కాంతారావు...**



**మంగపేట, నేటిధాత్రి:** తెలంగాన రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకుందని దానిని పురస్కరించుకొని గ్రామాలలో కూడా అంబేద్కర్ యువజన సంఘం ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. 21 సెప్టెంబర్ 1977 న సంఘం ఆవిర్భవించడం జరిగిందని , నాటి నుండి నేటి వరకు 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల వేడుకలను సంఘం వ్యవస్థాపకులు జె బి రాజు రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్ ఐవిలయ్య అద్వర్యములో ఘనంగా జరపాలని పిలుపునిచ్చారు. గ్రామాలలో కూడా అంబేద్కర్ యువజన సంఘాలను బలోపేతం చేయాలని చెప్పారు సెప్టెంబర్ 21న హైదరాబాదులో జరిగే ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గ్రామ, మండల, జిల్లాల నుండి అధిక సంఖ్యలో కుల మతాలకు అతీతంగా బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ కులాల వారు అంబేద్కర్ వాదులు మేధావులు శ్రేయోభిలాషులు వివిధ సంఘాల రాజకీయ పార్టీల నాయకులు అధిక సంఖ్యలో హాజరై గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. అలాగే గ్రామ, మండల, జిల్లాలో కూడ ఆవిర్భావ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ఆర్గ నైజింగ్ కార్యదర్శి దిగొండ కాంతారావు తెలిపారు.

# ప్రతి ఒక్కరు అంగన్వాడీ విద్య వినియోగించు కోవాలి



**శాయంపేట, నేటిధాత్రి:** శాయంపేట మండలం కొత్తగ ట్టుసింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో సూప ర్వైజర్ పుట్ట పుణ్యవతి ఆధ్వర్యంలో పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజ ర్ పుణ్యవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంగన్వాడీ విద్య సేవలు వినియోగించు కోవాలి. జూన్ మాసంలో 2 వ తేదీన అమ్మ ముద్ద కార్య క్రమం ప్రారంభం అవుతుంది ఉద్దేశం ఏంటి అంటే



అంగన్ వాడీ పిల్లలకు పోషకమైన, మిశ్రమ అల్పాహార ఎంపిక లను (ఉప్మా మరియు కిచిడీ వంటివి) అందించడం ద్వారా బాల్యదశలో పోషకాహార లోపాన్ని ఎదుర్కోవడం. పిల్లల్ని మరో అమ్మల చూసు కొనే టీచర్స్ ఉన్నారు. కాబట్టి పిల్లలు ఎదిగే వయస్సులో చిన్న తనంలోనే ప్రైవేట్ బస్సులు ఎక్కిస్తూ, వెయ్యిల కొలది ఫీజులు కడుతూ పిల్లలను మానసికంగా కృంగేలా మన తల్లిదండ్రులే చేస్తున్నారు. కాబట్టి ఎదిగే వయస్సులో పిల్లలకి కావలసిన పోషకహారం, ఆటలు,పాటలు మరియు విద్య కార్యక్రమాలు నేర్పిస్తూ ఉండే ఈ అంగన్వాడి సెంటర్ చాలా సౌకర్యవంతంగా ఉంది ప్రతి ఒక్కరు వినియోగించుకో వాలి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కూకిడి శివాజీ ఉప సర్పంచ్ కొత్తగట్టు సాయి కృష్ణ చేతుల మీదిగా 5 సంవ త్సరాలు నిండిన పిల్లలకి ధృవీకరణ పత్ర సర్టిఫికెట్స్ మరియు యూనిఫాములు అందజేశారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడి టీచర్లు దౌడు. మధుర, బలేరావు. రేవతి, మామిడి. నరిత,ఆశలు పెంబర్తి. నీల, రమాదేవి,పిల్లలు,గర్భిణీ స్త్రీలు,బాలింతాలు,తల్లిదండ్రులు,యువతి యువకులు నాగరాజు,సురేష్, 8వ వార్డు మెంబర్ పాల్వాయి స్వర్ణ పెంబర్తి వినయ్ పాల్గొన్నా రు..

# 8 మంది దొంగల ముఠా అరెస్ట్

**విలువైన ఆభరణాలు ధరించి ఆరుబయట నిద్రించవద్దు, ఇంటికి తాళలు వేసి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని దొంగతనాల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలని పోలీసు వారి సూచన.**



**మంగపేట, నేటిధాత్రి:** మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మంగపేట, గంపోనిగూడెం, కమలాపురం, నర్సాపురం బోరు గ్రామాల్లో జరిగిన పలు చోరీ కేసులను ఛేదించి 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై టీవీఆర్ సూరి, శ్రీకాంత్ లు తెలిపారు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. దొంగల వివరాలను తెలిపారు. మంగపేట మండలంలోని కమలాపురంకు చెందిన నిమ్మల వినయ్ కుమార్, పరమాత్ముల శివ, బోయి పరుశురాం, రాయరకుల సారయ్య, నిమ్మల కుమార్, భూక్యా ప్రవీన్, ఏటూరునాగారం మండలం చిన్నబోయినపల్లికి చెందిన మహ్మద్ బిజిగిరి, కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లికి చెందిన బండి తరుణ్ లు ఈ కేసులో ప్రధాన నిందితులని తెలిపారు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు నమోదై ఉండగా, పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినట్లు విచారణలో తెలిసింది. నిందితుల నుండి 1/2 తులం బంగారం, 40 తులాల వెండి వస్తువులు, మూడు బైక్ లు రూపాయలు 10 వేలు, 30 కేజీల కాపర్ వైరు, 3 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుట్ను వెల్లడించారు. వీరు మంగపేట, కొత్తగూడెం, నిజామాబాద్ ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్ ఐ టీవీఆర్ సూరి, శ్రీకాంత్ లు తెలిపారు. ప్రజలు వేసవి కాలంలో చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్నందున ప్రజలు రాత్రి సమయంలో ఆరు బయట నిద్రించే సందర్భాల్లో బంగారు ఆభరణాలు ధరించకుండా ఉండాలని ఇంటికి తాళాలు వేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

## విద్య సమస్యలు పరిష్కరించాలి



**ఆర్డీఓకు వినతిపత్రం అందించిన ఎస్ఎఫ్ఐ నాయకులు**

**పరకాల, నేటిధాత్రి:** పరకాల పట్టణానికి నూతనంగా వచ్చిన ఆర్డీవో వెంకన్న సార్‌ను ఎస్ఎఫ్ఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విద్యారంగ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని నాయకులు కోరారు. శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని,విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కళ్యాణ్,పట్టణ అధ్యక్షుడు బొచ్చు ఈశ్వర్,జిల్లా కమిటీ సభ్యుడు హేమంత్,పట్టణ కార్యదర్శి సాయి తేజ,ప్రవీణ్,బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సూచిక బోర్డుల ఏర్పాటు.



**దుగ్గొండి, నేటిధాత్రి:** రోడ్డు భద్రత నియమాల పట్ల దుగ్గొండి మండలంలో సూచికల బోర్డులను ఎస్సై రావుల రణధీర్ రెడ్డి శనివారం ఏర్పాటు చేశారు. అవని ప్రైవేట్ కళాశాల వారు ట్రాఫిక్ నిబంధనల నియమావళి బోర్డులను బహుమతిగా అందించగా మండలంలో పలు ప్రధాన రహదారిపై ఎస్సై రణధీర్ రెడ్డి ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో దుగ్గొండి సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, ఏఎస్సై ప్రభాకర్,పోలీస్ సిబ్బంది పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## విషపురుగులకు నిలయంగా మారిన పార్కు



**తాండూర్, నేటిధాత్రి:** తాండూరు మండలం మాదారం టౌన్‌షిప్‌లోని రామాలయం సమీపంలో ఉన్న సింగరేణి పార్కు పిచ్చి మొక్కలతో నిండిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పార్కులో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విషపురుగులకు నిలయంగా మారిందని స్థానికులు తెలిపారు. పార్కు సమీపంలో నివాస గృహాలు ఉండటంతో సాయంత్రం,రాత్రి వేళల్లో విషపురుగులు ఇళ్ల పరిసరాల్లో సంచరిస్తున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపిల్లలు,వృద్ధులు బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. అధికారులు వెంటనే స్పందించి పిచ్చి మొక్కలను తొలగించి పార్కును శుభ్రపరచడంతో పాటు అందంగా తీర్చిదిద్దాలని టౌన్‌షిప్ ప్రజలు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు.

# మృతుల కుటుంబాలకు అండగా నిలిచిన డాక్టర్ కాళీ ప్రసాద్ రావు



**పరకాల, నేటిధాత్రి:** పరకాల నియోజకవర్గంలోని పలువురు మృతుల కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,పరకాల నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. రాయపర్తి గ్రామానికి చెందిన కోడెం బుచ్చమ్మ ఇటీవల మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

అలాగే పరకాల నియోజకవర్గానికి చెందిన రాపాక రాజేశ్వరి,కొత్తగట్టు దేవమణి కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. అదేవిధంగా ఇటీవల మరణించిన బండి నర్సయ్య,బండి లక్ష్మి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జయంతిలాల్, 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్, 12వ వార్డు కౌన్సిలర్ ఆకుల శ్రీధర్,జిల్లా కోశాధికారి ఎర్రం రమణ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు




**కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్**

**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సింగరేణి భవనంలో భూపాలపల్లి టౌన్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు ఇస్లావత్ దేవన్ ఆధ్వర్యంలో ఐటీ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది, కేక్ కటింగ్ అనంతరం పట్టణ అధ్యక్షులు దేవన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కీ వెన్నుముక శ్రీధర్ బాబు ప్రభుత్వంలో ఉన్న పతిపక్షంలో ఉన్న ఐనా ప్రత్యేకత వేరు, ప్రజలకు శ్రీధర్ బాబు అంటే ఒక నమ్మకం ఒక అభయం, ఒకసారి గెలవడానికే ఆపసోపాలు పడే నాయకులు ఎందరో కానీ ఐదు సార్లు ఎమ్మెల్యే గా గెలవడం అంటే మాములు విషయం కాదు, మంథని ప్రజల గుండె చప్పుడు శ్రీధర్ బాబు అనుకోకుండా ఆ కుటుంబములో ఒక సంఘటన జరిగిన తర్వాత రాజకీయ అరగ్రేటం చేసినప్పటి నుండి వరకు ప్రజల కొరకు అనునిత్యం పాటు పడే నాయకులు శ్రీధర్ బాబు ప్రభుత్వం ఏర్పాటు జరిగిన తర్వాత ఐటీ శాఖ మంత్రి గా లక్షల కోట్ల రూపాయలు, విదేశీ పెట్టుబడులు తేవడం లో కీలక పాత్ర పోషించడం జరిగింది,ప్రభుత్వాన్ని శ్రీధర్ బాబు నడిపిస్తున్నారు అని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో సందర్భంలో మాట్లాడటం మనకు తెలిసిన విషయమే,అలాంటి నాయకులు 56 సంవత్సరాలో అడుగు పెడ్తున్న సందర్భంగా ఇలాంటి కార్యక్రమం చేయడం చాలా అదృష్టం గా భావిస్తున్నాను, మరొక్క సారి కాంగ్రెస్ పార్టీ ని అధికారం లోకి తేవడానికి అనునిత్యం కష్టపడ్తున్న నాయకులు శ్రీధర్ బాబు అని తప్పకుండ ఏదో ఒకరోజు తెలంగాణ రాష్ట్ర సారధి గా చూడాలని ఉందని దేవన్ తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఐఎన్ టియుసి నాయకులు కౌన్సిలర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా నేరస్తుల అరెస్ట్

**చోరీ సొత్తు స్వాధీనం:గీసుకొండ సిఐ విశ్వేశ్వర్....**




**గీసుగొండ, నేటిధాత్రి:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గీసుగొండ మండలంలో ఇటీవల వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్‌జిల్లా నేరస్తులను గీసుగొండ పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గీసుగొండ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం మధ్యాహ్నం గీసుగొండ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ సిబ్బందితో కలిసి కోనాయమాకుల ఎస్ఆర్ఎస్పీ కెనాల్ సమీపంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒక మోటార్ సైకిల్‌పై ఎం.డి. ఇమ్రాన్ అలియాస్ ఇమామ్,సూర రవి అనే ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా, గీసుగొండ మండలంలోని రాంపూర్, ఎలుకుర్తి, శాయంపేట, గొర్రెకుంట గ్రామాల పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ బావులు, ఎస్ఆర్ఎస్పీ కెనాల్ వద్ద ఉన్న పంపు మోటర్లు, ఇనుప సామగ్రి మరియు ఒక మోటార్ సైకిల్‌ను గత పది రోజులుగా చోరీ చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిపారు. అరెస్టు చేసిన నిందితుల్లో కరీంనగర్‌కు చెందిన సూర రవి, మహబూబాబాద్‌కు చెందిన ఎం.డి. ఇమ్రాన్ అలియాస్ ఇమామ్ ఉన్నారు. నిందితుల వద్ద నుంచి హీరో స్ప్లెండర్ మోటార్ సైకిల్, రెండు 3 హెచ్‌పి మోటర్లు, రూ.9 వేల నగదు, మోటార్ వాల్వ్, ఎనిమిది సెంట్రింగ్ ఐరన్ పైపులు, రెండు బకెట్లు, రెండు ఐరన్ రాడ్లు, రెండు రాతెండు బిందెలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ. 35 వేల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. నిందితుడు సూర రవిపై కరీంనగర్, కేశవపట్నం, బోయినపల్లి, మానకొండూరు, మిల్స్ కాలనీ, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 24 దొంగతన కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు. అలాగే ఎం.డి. ఇమ్రాన్ అలియాస్ ఇమామ్‌పై వరంగల్ మిల్స్ కాలనీ, నర్సంపేట, ఖానాపూర్, మహబూబాబాద్, కాగజ్‌నగర్, గీసుగొండ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 9 దొంగతన కేసులు నమోదై ఉన్నట్లు వెల్లడించారు. ఇద్దరు నిందితులపై సస్పెక్ట్ షీట్లు కూడా కొనసాగుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్న గీసుగొండ పోలీస్ స్టేషన్ సిబ్బందిని ఇన్‌స్పెక్టర్ డి. విశ్వేశ్వర్ అభినందించారు.

# అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి ఉప్పల వెంకటేష్ సిమెంట్ అందచేత:



**కల్వకుర్తి, నేటిధాత్రి:** కల్వకుర్తి నియోజకవర్గం, కల్వకుర్తి మండలంలోని పంజుగుల గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సహకారంతో కృష్ణయ్య ఇంటికి సిమెంటును అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప్పల వెంకటేష్ ముఖ్య అనుచరుడు దారమోని గణేష్,గ్రామ మాజీ వార్డు సభ్యులు ఖాజా, రాజేందర్ రెడ్డి,మల్లేష్, ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసులు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనివాస్ కుటుంబాన్ని పరామర్శించిన రైస్ మిల్లర్స్



**భూపాలపల్లి, నేటిధాత్రి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆంధ్రప్రభ స్టాఫ్ రిపోర్టర్ పావుశెట్టి శ్రీనివాస్ తండ్రి కీ.శే. పావుశెట్టి సాంబయ్య ఇటీవల మృతిచెందనం జరిగింది జిల్లా రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. శనివారం హనుమకొండ జిల్లా హాసన్‌పర్తిలోని వారి నివాసానికి వెళ్లిన రైస్ మిల్లర్లు సాంబయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. సాంబయ్య మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరే రవి, పెండం రేపాల్, ట్రాన్స్పోర్ట్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మాతా శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట సర్పంచ్ లక్ష్మణ్




**తాండూర్, నేటిధాత్రి:** మంచిర్యాల జిల్లా తాండూర్ మండలంలోని మాదారం గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రం-3లో శుక్రవారం "అమ్మ మాట అంగన్వాడి బాట" కార్యక్రమాన్ని అంగన్వాడీ టీచర్ మీన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్,ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ..ఐదు సంవత్సరాల లోపు ఉన్న ప్రతి చిన్నారిని అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేసి,క్రమం తప్పకుండా పంపించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా--శిశు సంక్షేమ అభివృద్ధి శాఖ ద్వారా అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. మాతా--శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని,అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు యూనిఫాంలు అందించడం అభినందనీయ నిర్ణయమని అన్నారు. గ్రామ ప్రజలందరూ తమ పిల్లలను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు చేయించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రం పిల్లలకు మరో తల్లి వంటిదని, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారం చిన్నారులు,గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. అందరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు కత్తెర్ల రవికుమార్, సౌమ్య,కాంగ్రెస్ నాయకులు మీస శంకర్,ఆనంద్,పుట్ట పోషం,సీపీఐ నాయకులు పోషం,చిన్నారులు,వారి తల్లులు పాల్గొన్నారు.

# లీడ్ లైబ్రరీలో అక్షరయోధుడు రాధేయతో ఆత్మీయ సంభాషణ

**ఐదు దశాబ్దాల సాహిత్య సేవకు సన్మానం...."పావుకోళ్ళు" పుస్తక పరిచయం..సాహిత్యమే చైతన్య దిక్సూచి....**



**నర్సంపేట, నేటిధాత్రి:** అక్షరాన్నే ఆయుధంగా చేసుకుని ఐదు దశాబ్దాలుగా తెలుగు సాహిత్యానికి సేవలందిస్తున్న ప్రముఖ సాహితీవేత్త, ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు వ్యవస్థాపకులు డాక్టర్ రాధేయతో లీడ్ లైబ్రరీలో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాధేయ తాజా రచన "పావుకోళ్ళు" పుస్తకాన్ని లీడ్ లైబ్రరీ వ్యవస్థాపకులు కాసుల రవికుమార్ పరిచయం చేశారు. రాధేయ సాహిత్య ప్రస్థానాన్ని వక్తలు ప్రస్తావిస్తూ, తెలుగు భాషా సాహిత్యానికి ఆయన అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. సాహిత్యం సమాజ చైతన్యానికి దిక్సూచిగా నిలుస్తుందని, పుస్తక పఠనం ద్వారా విలువలతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని రాధేయ పేర్కొన్నారు. జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను అధిగమించడానికి అక్షరమే తనకు బలమని, కవిగా సాగిన సుదీర్ఘ ప్రయాణంలో ఎదురైన అనుభవాలను, ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు నిర్వహణలోని విశేషాలను సభికులతో పంచుకున్నారు. పుస్తక పరిచయం, సాహిత్య చర్చలు, కవుల ఆత్మీయ సంభాషణలతో సమావేశం స్ఫూర్తిదాయకంగా సాగింది. తెలుగు భాషా సాహిత్య వికాసానికి ఇటువంటి వేదికలు ఎంతో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. సమావేశం ముగింపులో కాసుల రవికుమార్, శోభారాణి దంపతులు డాక్టర్ రాధేయను ఘనంగా సన్మానించారు. అనంతపురం నుంచి నర్సంపేట వరకు ప్రయాణించి తన అమూల్యమైన సూచనలు, అనుభవాలను పంచుకున్న రాధేయకు లీడ్ లైబ్రరీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ జగదీశ్వర్, జీజుల సాగర్, ఉపాధ్యాయులు రఘుపతి, కొర్ర రమేష్, పెండెం భాస్కర్, రచయిత రాపాక శ్రీనివాస్,



స్థానిక నాయకులు శివ, మల్లేశం, యాదగిరి స్వామి, మల్లయ్య తదితరులు పాల్గొని సాహిత్యంపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

# పంట కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు.

**భూమికి ఉరి.. వరి కొయ్యలకు నిప్పు; కాలిపోతున్న నేల సారం, కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి...గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య, కోదాడ రూరల్ ఎస్సై గోపాల్ రెడ్డి, వ్యవసాయ అధికారి ఏపీవో రజిని....**



**కోదాడ, నేటిధాత్రి:** పంట కొయ్యలు కాల్చడం వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు కార్యక్రమాన్ని శనివారం కోదాడ మండల పరిధిలోని గుడిబండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ. పొలాల్లో వ్యర్థాలను తగలబెట్టడం వల్ల దట్టమైన పొగ ఏర్పడి గాలి కాలుష్యం జరిగి ఇది ప్రజల ఆరోగ్యానికి ముఖ్యంగా శ్వాసకోశ సమస్యలకు దారితీస్తుందని వివరించారు. అనంతరం వ్యవసాయ అధికారి ఏపీవో రజిని మాట్లాడుతూ. రైతులు వరి కోసిన తర్వాత కొయ్యలను కాల్చకుండా వాటిని భూమిలోనే కలియదున్నాలని. దీనివల్ల వ్యర్థాలు కుళ్లిపోయి సేంద్రియ ఎరువుగా మారి తదుపరి పంటకు భూమి సారవంతంగా తయారవుతుందని దీనికి తోడు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వివిధ రకాల వ్యవసాయ యంత్రాలను రోటవేటర్, మల్చర్ మొదలైనవి ఉపయోగించి కొయ్యలను పొలంలోనే ఎరువుగా మార్చుకోవచ్చని సూచించారు. అనంతరం కోదాడ రూరల్ ఎస్సై సిహెచ్. గోపాల్ రెడ్డి మాట్లాడుతూ. వరి కోతలను కొయ్యలను కాల్చడం చట్టరీత్యా నేరమని పర్యావరణ పరిరక్షణ చట్టం మరియు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన (జీవో 27) ప్రకారం పంట అవశేషాలను బహిరంగగా కాల్చడం నిషేధం. ఈ నిబంధనను ఉల్లంఘించి పొలంలో వ్యర్థాలను కాలిస్తే చట్టపరమైన కేసులు నమోదు చేయడంతో పాటు 5.000 వేల నుండి 25.000 వేల వరకు జరిమానా విధించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇర్ల నరసింహారెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ ఇర్ల జయసింహారెడ్డి, వార్డు మెంబర్లు, మరియు గ్రామపంచాయతీ సెక్రటరీ వ్యవసాయ అధికారి ఏఈఓ సల్మా, మాదాసి నాగరాజు, ఇస్సాకు, సోమపొంగు శ్రీను, పున్నయ్య, పసుపులేటి గురవయ్య, ప్రసాద్ రెడ్డి, ఆశా వర్కర్లు గ్రామ రైతులు పెద్దలు యువకులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# టి యు వి మండల అధ్యక్షుడు గా నిరంజన్ రావు నియామకం



**తాండూరు, నేటిధాత్రి:** తెలంగాణ ఉద్యమకారుల వేదిక (టి యు వి) తాండూరు మండల అధ్యక్షుడు గా చప్యాల నిరంజన్ రావు ను నియమించినట్లు టి యు వి రాష్ట్ర చైర్మన్ నరాల సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టి యు వి మండల అధ్యక్షుడు నిరంజన్ రావు మాట్లాడుతూ.. తనపై నమ్మకం తో అధ్యక్షుడు గా నియమించినందుకు చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ తోడేటి శంకర్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోగర్ల రాజేశం, కార్యదర్శి మద్దిబోయిన అర్జున్ కు కృతజ్ఞతలు తెలియజేశారు. మండలంలోని తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న ఉద్యమకారులను గుర్తించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను ఎప్పటికీ మరువలేమని అన్నారు. తొలి దశ ఉద్యమం నుంచి 2014 వరకు వేలాది మంది ఉద్యమకారులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కొంతమంది ప్రాణత్యాగాలు కూడా చేశారని గుర్తు చేశారు. ఉద్యమంలో పాల్గొన్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు రావాలని, వారి కుటుంబాలకు న్యాయం జరిగేలా టి యు వి కృషి చేస్తుందని తెలిపారు.

# నేతాజీ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా



**23 మంది విద్యార్థులకు నియామక పత్రాల అందజేత**

**సిరిసిల్ల, నేటిధాత్రి:** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్లలో పట్టణంలోని నేతాజీ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎస్ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఎంఎన్‌సీ సంస్థ అయిన లాలాటాక్ష కంపెనీ ప్రతినిధులు పాల్గొని కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం పూర్తి చేసి రెండో సంవత్సరం చదువుతున్న 23 మంది విద్యార్థులను యూఎస్ ఐటి బెంచ్ సేల్స్ రిక్రూటర్ పోస్టులకు ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు కంపెనీ ఆఫర్ లెటర్లను సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్ర చారి, కళాశాల చైర్మన్ జూపెల్లి పృథ్వీధర్ రావు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థులు తమ నియామక పత్రాలపై సంతకాలు చేశారు. ఎంపికైన వారికి వార్షిక వేతన ప్యాకేజీ రూ. 1.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు ఉంటుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్ర చారి మాట్లాడుతూ, డిగ్రీ చదువుతూనే ఉద్యోగ అవకాశాలు పొందడం



విద్యార్థులకు అరుదైన అవకాశం అని అన్నారు. సాధారణంగా అమెరికా, కెనడా వంటి దేశాల్లో మాత్రమే ఇలాంటి విధానాలు ఎక్కువగా కనిపిస్తాయని, అయితే సిరిసిల్లలోని నేతాజీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఈ అవకాశం లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ ప్రాంత విద్యార్థిని విద్యార్థులు ప్రతి అవకాశాన్ని అదృష్టంగా భావించాలని అన్నారు.. విద్యార్థులు ఉద్యోగంతో పాటు తమ డిగ్రీ విద్యను కూడా విజయవంతంగా పూర్తి చేసి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులకు జాయినింగ్ లెటర్లు, మెడల్స్ అందజేసి అభినందనలు తెలిపారు.. అనంతరం కళాశాల అధ్యాపక బృందాన్ని మేనేజ్మెంట్ను విద్యార్థిని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు అభినందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ నాయిని జగన్మోహన్ రావు, కళాశాల ప్రిన్సిపల్ రేశం శ్రీకాంత్, అధ్యాపక బృందము, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# క్యాతనపల్లి కౌన్సిల్ సాధారణ సమావేశం...




**రామకృష్ణాపూర్, నేటిధాత్రి:** క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం మున్సిపాలిటీ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి- రాజా రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. కౌన్సిల్ సాధారణ సమావేశంలో నాలుగు అభివృద్ధి



అంశాలను ప్రవేశపెట్టగా, కౌన్సిల్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించినట్లు తెలిపారు. మున్సిపాలిటీ కార్యాలయం ద్వారా నాలుగు స్వచ్ఛ ఆటోలను కొనుగోలు చేయగా వాటిని కౌన్సెల్ సభ్యులు ప్రారంభించారు. కోతుల నివారణకు ఐదు లక్షలు, తాగునీరు, వీధి దీపాల మరమ్మతులకు 60 వేలు, పారిశుద్ధ్య నిర్వహణ, పిచ్చి మొక్కల తొలగింపు రెండు జెసిబిలను అద్దెకు తీసుకొనుటకు రెండు లక్షలు మంజూరు చేసినట్లు చైర్పర్సన్ తెలిపారు. కౌన్సిల్ సాధారణ సమావేశ కార్యక్రమంలో వైస్ చైర్పర్సన్ మిట్టపల్లి సరిత- శ్రీనివాస్, కౌన్సిలర్లు, మున్సిపాలిటీ కమిషనర్ మారుతి ప్రసాద్, రెవెన్యూ అధికారి కే సతీష్, డి ఈ సుమతి, ఎంఏఈ అశ్రిత్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పదవీ విరమణ సందర్భంగా నర్సింగరావు కు ఘన సన్మానం

**అంకితభావంతో పనిచేసిన వ్యక్తి నర్సింగరావు.... మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్....**



**పరకాల, నేటిధాత్రి:** పురపాలక సంఘం పరకాల కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వాటర్ సప్లయ్ లైన్‌మెన్ రాపెల్లి నర్సింగరావు పదవీ విరమణ సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ నర్సింగరావు తమ సేవా కాలంలో ప్రజలకు మరియు మున్సిపాలిటీకి అంకితభావంతో సేవలందించారని కొనియాడారు. మున్సిపల్ సేవల విషయంలో ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న నర్సింగరావుని శాలువాతో సత్కరించిజ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగ నర్సింగరావు మాట్లాడుతూ తన సేవా కాలానికి సంబంధించిన అనుభవాలను పంచుకుంటూ సహోద్యోగులు,ప్రజాప్రతినిధులు మరియు ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంచార్జీ కమీషనర్ సి. హెచ్. రంజిత్,వైస్ చైర్‌పర్సన్ ఏకు దివ్య,శ్రీ దుబాసీ వెంకటస్వామి,బొచ్చు శ్యామల,గూడెల్లి సదన్ కుమార్,ఆకుల లావణ్య,బొచ్చు మాధవి లత,కుక్కల విజయ్ కుమార్,బండిశ్రీధర్,కార్యాలయ ఉద్యోగులు,కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా కలకొండ రమేష్ చంద్ర



**వనపర్తి, నేటిధాత్రి:** వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి శిష్యులు కలకొండ రమేష్ చంద్ర రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా నియామకం అయ్యారు ఈ మేరకు ఆయన రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమర వాది లక్ష్మీనారాయణ నుండి నియామక పత్రాన్ని అందుకున్నారు ఈసందర్భంగా వనపర్తి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బచ్చు రాం లగిశెట్టి సాయి ప్రసాద్ ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు బచ్చు వెంకటేష్ వర్తక సంఘం అధ్యక్షులు పాలాది సుమన్ ఒక ప్రకటనలో వర్షం వ్యక్తం చేశారు ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు అమరావాది లక్ష్మీనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు

# ఇటుకాలపల్లి సెంటర్ 2లో "అమ్మ మాట బంగారు బాట" కార్యక్రమం



**నర్సంపేట, నేటిధాత్రి:** నర్సంపేట మండలం ఇటుకాలపల్లి సెంటర్ 2లో "అమ్మ మాట - బంగారు బాట" కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రీ స్కూల్ 2.5 ఏళ్ల పిల్లల నమోదు ప్రక్రియతో పాటు అంగన్వాడీ కేంద్రాల్లో 5-6 ఏళ్లు పూర్తి అయిన పిల్లలకు విద్యారంభం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సర్టిఫికెట్ ఒకటో తరగతిలో ప్రవేశానికి ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా అంగన్వాడీకి వచ్చే పిల్లలకు ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. అంగన్వాడీ పరిధిలో 3 నుంచి 6 సంవత్సరాల అర్హులైన పిల్లలను గుర్తించి నమోదు చేశామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో నేర్చుకోవడానికి అనువైన వాతావరణం కల్పిస్తున్నామని ఏసీడీపీఓ జ్యోతి చెప్పారు. ఆట పాటలతో, రకరకాల వస్తువులతో పిల్లలు నేర్చుకునేలా ఏర్పాట్లు చేశామని, చదవడం, రాయడానికి కావాల్సిన నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వివరించారు. అంగన్వాడీలో చదువు సమగ్రాభివృద్ధికి నెలవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ అరుణ, ఇటుకాలపల్లి సెంటర్ 2 టీచర్ రమాదేవి, ఇతర అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

# చలపర్తిలో కోల నరసయ్య-వీరలక్ష్మి జ్ఞాపకార్థం ఉచిత మెగా వైద్య శిబిరం



**400 మంది రోగులకు ప్రత్యేక వైద్యులు చికిత్స, మందుల పంపిణీ....**



**నర్సంపేట, నేటిధాత్రి:** దుగ్గొండి మండలంలోని చలవర్తి గ్రామంలో కోల నరసయ్య-వీరలక్ష్మి జ్ఞాపకార్థం లైన్స్ క్లబ్ నర్సంపేట గ్లోరీ ఆధ్వర్యంలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ నేపథ్యంలో 400 మంది రోగులకు వివిధ విభాగాల ప్రత్యేక వైద్యులు పరీక్షలు చేసి చికిత్స అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ వరంగల్ గవర్నర్ చంద్రశేఖర్ ఆర్య మాట్లాడుతూ, తల్లిదండ్రుల గుర్తుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. శిబిరంలో వైద్య సేవలు అందించిన వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ప్రతినిధులు సుధాకర్ రెడ్డి, రమణారెడ్డి, మోతే సమ్మిరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, వేములపల్లి రాజు, వైద్యులు డాక్టర్ మోహన్ రావు, డాక్టర్ హరి రమాదేవి, డాక్టర్ భరత్ రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ శంకర్, మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దీపక్, దుగ్గొండి ఎస్ఐ రావుల రణధీర్ రెడ్డి, సర్పంచ్ కోటగిరి భాస్కర్, డ్వాక్రా సిసి పోగాకు సుజాత, కోల నరసయ్య-వీరలక్ష్మి మెమోరియల్ ఫౌండేషన్ చైర్మన్ కోల వెంకటేశ్వర్లు, జ్యోతి సతీష్, భరత్ భగత్ పాల్గొన్నారు.

# అంగన్వాడి వైపు అడుగు చిన్నారి భవిష్యత్తుకు బంగారు బాట



**జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్...**

**మంచిర్యాల, నేటిధాత్రి:** అంగన్వాడి వైపు చిన్నారుల వేసే ప్రతి అడుగు బంగారు భవిష్యత్తుకు బాట అని జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్ అన్నారు.శనివారం మంచిర్యాల పట్టణంలోని రామ్ నగర్ సెక్టార్ లో నిర్వహించిన అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమానికి సి డి పి ఓ విష్ణు ప్రియ,సూపర్వైజర్ జ్యోతి,అంగన్వాడీ టీచర్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.చిన్నారుల సంక్షేమంలో భాగంగా అంగన్వాడి కేంద్రాలలో మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించడంతో పాటు సమయానుసారంగా పిల్లల ఎత్తు, బరువు లను నమోదు చేసి వారి శారీరక,మానసిక ఎదుగుదలను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.పోషణ్ అభియాన్ లో భాగంగా చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.ఆరోగ్యం,పోషణ, విద్యతో పిల్లల భవిష్యత్తు ప్రగతి బాటలో నడిపేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు,పిల్లల తల్లితండ్రులు,సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజల యొక్క.. ప్రజల చేత.. ప్రజల కొరకు ..

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్...**





**మంచిర్యాల, నేటిధాత్రి:** ప్రజల యొక్క – ప్రజల చేత – ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్యం మన దేశంలో కొనసాగుతూ ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మాక్ పార్లమెంట్ నిర్వహణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య,మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్,జిల్లా విద్యాధికారి ఎస్. యాదయ్య,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు,ఇతర శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈహొహొసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ద్వారా రాజ్యాధికారాన్ని చేపట్టే వారిని ఎన్నుకునే శక్తివంతమైన ఓటు హక్కు ప్రజలకు కల్పించబడిందని తెలిపారు. రాజ్యాంగం దేశాల వారీగా వివిధ రకాలుగా ఉంటుందని,మన దేశంలో అమలులో ఉన్న రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందని,ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం కలిగి ఉన్నామని తెలిపారు. శాసన సభ, పార్లమెంట్,సర్పంచ్,మండల పరిషత్,జిల్లా పరిషత్,స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే స్వేచ్ఛ కలిగి ఉన్నామని,రాష్ట్ర, కేంద్ర ఎన్నికల సంఘాల ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందని, సరైన నాయకులను ఎన్నుకునేహొహొస్వేచ్ఛ,హక్కు ప్రతి ఓటరుకు ఉంటుందని తెలిపారు. ఎన్నికలలో ప్రజలకు కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని తెలిపారు. ఎన్నికలలో గెలుపొందిన ప్రజా ప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని తెలిపారు. ప్రజలకు కల్పించిన హక్కులు,చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.

## విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి- ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు



మంచిర్యాల శాసనసభ్యులు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని తెలిపారు. విద్య అనేది ఉద్యోగం కోసం మాత్రమే కాదని,సమాజంలోని ప్రతి అంశాన్ని తెలుసుకోవాలని,జ్ఞానం సంపాదించుకోవాలని,హక్కులు, చట్టాలు తెలుసుకోవాలని, విద్యార్థిని, విద్యార్థులు ఆత్మ రక్షణ విద్య నేర్చుకోవాలని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లల కోసం పడుతున్న కష్టాలు తెలుసుకోవాలని,ఏకాగ్రత, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదగాలని తెలిపారు. మహిళల రక్షణ, పోషణ,స్వావలంబన,సంక్షేమం కోసం ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. దేశంలో అనేక రకాల మతాలు,కులాలు, విభిన్న సంస్కృతులు ఉన్నప్పటికీ అందరం కలిసి జీవిస్తున్నామని, మనది యువ భారత దేశమని, దేశ భవిష్యత్తు యువతదేనని అన్నారు. భౌగోళికంగా,ఆర్థికంగా మన దేశం పటిష్టంగా ఉందని,దేశ భవిష్యత్తులో విద్య అత్యంత ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. అక్షరాస్యతలో మంచిర్యాల జిల్లాలో ముందంజలో ఉంచాలని,జిల్లా ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రం సమన్వయంతో కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "కథ చెబుతా వింటారా " కథల పోటీ




**హనుమకొండ, నేటిధాత్రి:** హనుమకొండ కు చెందిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ వినూత్న ప్రయోగం చిన్నారులకు తెలుగు పట్ల మక్కువ పెంచాలని, అమ్మ భాష ఐన తెలుగు భాషని గౌరవించాలని, మరుగున పడుతున్న తెలుగు భాష సంస్కృతి ని వికసింపజేయాలనీ, తెలుగు భాష మీద పట్టు, పదాల కూర్పు, సమయస్ఫూర్తి, వాక్య నిర్మాణం, భాష సరళత, విలువలు, పద ధారలత, చక్కని వ్యాఖ్యనం ఇవ్వన్నీ పెంపొందించే దిశగా "కథ చెబుతా వింటారా" అనే పేరుతొ కథలు చెప్పే పోటీని నిర్వహిస్తున్నామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ మంజుల సాగంటి ఒక ప్రకటనలో తెలిపారు... జూన్ లో ఈ పోటీ నిర్వహిస్తామని చిన్నారులు వారి పేరు వివరాలు 8143643337 నెంబర్ లో నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు... చిన్నారుల చేత ఇంట్లోనే 2 నిముషాలు నిడివి గల నీతి, విలువలు కలిగిన ఒక కథను చెప్పించి వీడియో తీసి వాట్సాప్ కు పంపగా ఎంపిక చేయబడిన చిన్నారులకు న్యాయ నిర్ణేతల ముందు పోటీ నిర్వహించబడుతుంది. 1-3 తరగతులు, 4-6 తరగతులు, 7-10 తరగతులు 1,2,3 విభాగలుగా పోటీ ఉంటుంది... 3 నిమిషాల వ్యవధిలో కథ చెప్పవలసి ఉంటుంది.. నీతి, విలువలు, మంచిని పెంచేలా కథలు ఉండాలి... ప్రతి ఒక్కరికి ప్రశంసా పత్రం అందించబడును... విజేతలకు బహుమతులు అందించబడతాయని.. చెప్పే కథ వ్రాత ప్రతితో ఫోటో జత చేసి అందించాల్సి ఉంటుంది. ఎంపిక చేయబడిన చిన్నారుల కథలన్ని పుస్తకరూపంలో అచ్చు వేయబడతాయని తెలిపారు.

# బంగారానికి తగ్గుతున్న డిమాండ్

**మరోమారు స్వల్పంగా తగ్గిన ధరలు,,**

**ముంబయి, నేటిధాత్రి:** దేశంలో బంగారానికి డిమాండ్ భారీగా పడిపోయింది. పసిడి విక్రయాలు 70 శాతం తగ్గిపోయాయి. ఈ నేపథ్యంలో ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,640 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,44,500 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,18,230 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. శనివారం బంగారం ధరలు భారీగా తగ్గాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై రూ. 600.. 22 క్యారెట్ల బంగారంపై రూ. 550 .. 18 క్యారెట్ల బంగారంపై రూ. 450 తగ్గింది. గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,57,040 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,43,950 రూపాయల వద్ద.. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,17,780 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

# ధవళేశ్వరం ఆయకట్టు రైతులకు శుభవార్త

**నేటి నుంచే కాలువలకు నీటి విడుదల...ఖరీఫ్ సీజన్‌కు ముందస్తు ఏర్పాట్లు పూర్తి....నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు...**

**కాకినాడ, నేటిధాత్రి:** ఖరీఫ్ సీజన్‌కు సిద్ధమవుతున్న ధవళేశ్వరం ఆయకట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మే 31వ తేదీ నుంచి ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కాలువలకు సాగునీటిని విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి కందుల దుర్గేష్ ప్రకటించారు. రైతులు ముందస్తుగా నాట్లు వేసుకునేందుకు, సాగు పనులను వేగవంతం చేసుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఖరీఫ్ ముందుగానే నీటి సరఫరా రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుగానే నీటిని విడుదల చేస్తున్నామని మంత్రి వివరించారు. ప్రస్తుతం ప్రధాన కాలువలు, ఉపకాలువల మరమ్మతు పనులు కొనసాగుతున్నందున పరిస్థితిని బట్టి దశలవారీగా నీటిని విడుదల చేయనున్నట్లు చెప్పారు. సలహా మండలి సమావేశంలో కీలక నిర్ణయాలు మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన నిర్వహించిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో సాగునీటి పంపిణీ, కాలువల ప్రారంభ తేదీలు, నీటి నిర్వహణ ప్రణాళికపై విస్తృతంగా చర్చించారు. రైతులకు ఎక్కడా సాగునీటి కొరత లేకుండా సమన్వయంతో చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రైతుల ప్రయోజనాలకే ప్రాధాన్యం ఖరీఫ్ సీజన్‌లో ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. రైతులు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు ధవళేశ్వరం బ్యారేజీ గేట్ల మరమ్మతుల కోసం రూ.148 కోట్లు విడుదల చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. బ్యారేజీ ఆధునీకరణతో భవిష్యత్తులో నీటి నిర్వహణ మరింత మెరుగుపడుతుందని అభిప్రాయపడింది. గోదావరి కాలువ్యవ నివారణకు చర్యలు గోదావరి నది కాలుష్య నివారణ కోసం రూ.100 కోట్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు కూడా సమావేశం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపింది. నది పరిరక్షణతో పాటు సాగునీటి నాణ్యత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

# విశాఖ నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి

**అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద భారీ ప్రతిపాదనలు....విశాఖకు రూ.1,500 కోట్ల ప్రాజెక్టులు...అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : ఎంపీ శ్రీభరత్**

**విశాఖపట్నం, నేటిధాత్రి:** విశాఖ నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా తీర్చిదిద్దే దిశగా కీలక చర్యలు కొనసాగుతున్నాయని విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్ తెలిపారు. నగర డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి కోసం మరోసారి అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని వెల్లడించారు. రూ. 1,500 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద విశాఖకు ఇప్పటికే రూ. 1,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు మంజూరయ్యాయని ఎంపీ తెలిపారు. నగర మౌలిక వసతుల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, తాగునీటి సరఫరా మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మధురవాడలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మధురవాడ జోన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరా, నీటి పంపిణీ వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాజెక్టులు చేపడుతున్నామని వెల్లడించారు. ఈ పనుల పురోగతిపై దిశ సమావేశంలో సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. విశాఖ బీచ్‌ల ఖనిజ సంపద వినియోగం విశాఖ తీరప్రాంతంలో లభించే ఖనిజ సంపదను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు ప్రారంభించినట్లు శ్రీభరత్ వెల్లడించారు. దీని ద్వారా స్థానిక ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ఆదాయ వనరులు కూడా విస్తరించే అవకాశం ఉందన్నారు. వైసీపీ హయాంలో మందగించిన అభివృద్ధి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖలో అనేక కీలక ప్రాజెక్టులు నిలిచిపోయాయని, ఫలితంగా వాటి వ్యయం భారీగా పెరిగిందని శ్రీభరత్ విమర్శించారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆ ప్రాజెక్టులను తిరిగి పట్టాలెక్కిస్తున్నామని తెలిపారు. విశాఖ అభివృద్ధిపై సీఎం దృష్టి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దిశ సమావేశాలు నిర్వహించడం వల్ల అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతమవుతోందన్నారు.

## ప్రభుత్వ పాఠశాల నుంచి గాంధీ మెడికల్ కాలేజీ వరకు..

# "జయంత్" విజయగాథ.

- లింగగిరి గ్రామం నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసిన తొలి యువకుడు జయంత్
- పేద దళిత కుటుంబం నుంచి వైద్యుడిగా ఎదిగిన జయంత్.
- అన్న మృతిని తట్టుకుని లక్ష్యం సాధించిన జయంత్.




**వరంగల్, చెన్నరావుపేట, నేటిధాత్రి:**
వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగగిరి గ్రామానికి చెందిన మాదారపు జయంత్ ఎంబీబీఎస్ పూర్తి చేసి గ్రామానికి గర్వకారణంగా నిలిచాడు. లింగగిరి గ్రామం నుంచి ఎంబీబీఎస్ విద్యను పూర్తి చేసిన తొలి యువకుడిగా జయంత్ గుర్తింపు పొందడంతో గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.
నిరుపేద దళిత కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన జయంత్ తన ప్రాథమిక విద్యను పూర్తిగా ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించాడు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మడికొండలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలలో చదివి, అనంతరం ఘనపూర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. తన కృషి, పట్టుదలతో హైదరాబాద్ లోని గాంధీ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించి విజయవంతంగా కోర్సు పూర్తి చేశాడు.
ప్రస్తుతం అదే గాంధీ మెడికల్ కళాశాలలో ఏడాది పాటు ఇంటర్న్‌షిప్ చేయనున్నాడు. జయంత్ తల్లిదండ్రులు మాదారపు రమేష్, స్వరూప. వీరికి ప్రశాంత్, శ్రీకాంత్, జయంత్ అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. వారిలో చిన్నవాడైన జయంత్ చిన్ననాటి నుంచే చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ తన లక్ష్య సాధన కోసం నిరంతరం శ్రమించాడు.
ఎంబీబీఎస్ చదువుతున్న సమయంలో అతని రెండో అన్న శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. అయినప్పటికీ ఆ బాధను అధిగమించి, తన లక్ష్యాన్ని విడిచిపెట్టకుండా ముందుకు సాగి ఎంబీబీఎస్ పూర్తి చేయడం అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచింది.
జయంత్ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు, వదిన మౌనిక, అన్న పిల్లలు అనిరుధ్, అప్పీ కుషాల్, మామయ్యలు, అత్తమ్మలు, పిన్ని, బాబాయిలతో పాటు గ్రామ పెద్దలు, స్నేహితులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.
గ్రామీణ ప్రాంతానికి చెందిన ఒక సాధారణ కుటుంబం నుంచి వచ్చి వైద్య విద్యను పూర్తి చేసిన జయంత్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాడని గ్రామ పెద్దలు కొనియాడారు. కష్టపడి చదివితే ఏ లక్ష్యాన్నైనా సాధించవచ్చని జయంత్ నిరూపించాడని వారు పేర్కొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో తగ్గని ఎండల తీవ్రత

**ఎల్‌నినోతో ఆలస్యం కానున్న రుతుపవనాలు**

**హైదరాబాద్, నేటిధాత్రి:** తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు తోడు, వడగాలులు కూడా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అడపాదడపా కొన్నిచోట్ల ఉరుములతో కూడిన వర్షాలు పడుతున్నా, మొత్తంగా ఎండలు మాత్రం శాంతించడం లేదు. రుతుపవానలు కూడా ఆలస్యం అవుతున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'సూపర్ ఎల్‌నినో' ప్రభావంతోజూన్ 1 నుంచి అక్టోబర్ వరకు నైరుతి సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు లేవని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలో భిన్నవాతావరణం కొనసాగుతున్నది. తెల్లవారుజామున, రాత్రివేళలో వర్షం కురుస్తుండగా.. మిగతా సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. 17 జిల్లాల్లో 45 డిగ్రీలకుపై గా గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యాయి. మంచిర్యాల జిల్లా తాండూరులో అత్యధికంగా 46.4 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. పెద్దపల్లి, వరంగల్ జిల్లాల్లో 46.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి, ఖమ్మం, కుమ్రం భీం ఆసిఫాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో 46.2 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలుగు రాష్ట్రాల్లో వర్షపాతం కొద్దిగా ఆశించినస్థాయిలో ఉన్నప్పటికీ దేశంలోని ఇతర ప్రాంతాల్లో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఇది దేశవ్యాప్తంగా రుతుపవనాల విస్తరణపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. వాతావరణంలో నెలకొన్న ఈ అనిశ్చితి దృష్ట్యా నీటిని పొదుపుగా వాడుకొంటూ, పంటల ప్రణాళికలను రూపొందించుకోవాలని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. 2026 నైరుతి రుతుపవనాల కాలానికి సంబంధించిన తుది దీర్ఘకాలిక వాతావరణ అంచనాలను భారత వాతావరణ శాఖ విడుదల చేసింది. ఈ సీజన్‌లో తెలంగాణలో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నట్టు తెలిపింది. ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు మధ్య తెలంగాణ ప్రాంతంలో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నట్టు వెల్లడించింది. ఈ వర్షాలు భూగర్భ జలవనరుల పునరుద్ధరణకు ఎంతో ఉపయోగపడుతాయని వివరించింది. సంవత్సరం వానకాలం ఎల్‌నినో ప్రభావంతో 2018 మాదిరిగానే ఉంటుందని వాతావరణ నిపుణులు వెల్లడించారు. తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. 2025 సంవత్సరం మాదిరి వర్షాలను ఆశించవద్దని తెలంగాణ వెదర్‌మ్యాన్ సూచించారు. జూన్, జూలై నెలల్లో సాధారణ వర్షాలు ఉంటాయని, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణంకంటే తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని అంచనా వేశారు. అయినప్పటికీ.. 2014-15లా సాధారణ వర్షపాతం 905.4 మి.వి. కురువాల్సి ఉండగా కేవలం 562.1 మి.వి. కురిసినంత తీవ్రంగా ఉండకపోవచ్చని తెలిపారు. గత 5-6 సంవత్సరాలతో పోలిస్తే ఈ సంవత్సరం రుతుపవన వర్షాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ ఏడాది దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షాల లోటు తీవ్రంగా ఉంటుందని, మధ్య తెలంగాణలో మంచి వర్షాలు కురుస్తాయని అంచనా వేశారు. ఈ ఏడాది రెండో వారంలో రాష్ట్రంలో నైరుతి రుతుపవనాల ఆరంభం ఉంటుందని చెప్పారు.

# పారదర్శకంగా డీఎస్సీ నియామక ప్రక్రియ

**డీఎస్సీ నిర్వహణపై ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.. విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టీకరణ...148 రోజుల్లోనే నియామకాల పూర్తి...**

**అమరావతి, నేటిధాత్రి:** డీఎస్సీ నిర్వహణపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ స్పష్టం చేశారు. ఉపాధ్యాయ నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. 16,347 పోస్టుల భర్తీ మొత్తం 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని ఆయన వెల్లడించారు. ఈ నియామక ప్రక్రియకు రాష్ట్రవ్యాప్తంగా 3.36 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. 226 కేసులు.. అయినా రికార్డు స్థాయిలో నియామకాలు డీఎస్సీపై 226 కేసులు నమోదైనప్పటికీ కేవలం 148 రోజుల్లోనే నియామక ప్రక్రియను పూర్తి చేసి ప్రభుత్వం రికార్డు సృష్టించిందని కోన శశిధర్ తెలిపారు. టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో పరీక్షలు రాష్ట్రవ్యాప్తంగా 154 టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో పరీక్షలను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. కంప్యూటర్ ఆధారిత పరీక్షా విధానంలో అత్యున్నత భద్రతా ప్రమాణాలు అమలు చేసినట్లు వివరించారు. ప్రశ్నాపత్రాల భద్రత అత్యంత కట్టుదిట్టం ప్రశ్నాపత్రాలను ఎవరూ మార్చలేరని స్పష్టం చేసిన కోన శశిధర్, ప్రశ్నాపత్రం తయారీ నుంచి పరీక్ష ముగిసే వరకు భద్రతా వ్యవస్థ పటిష్టంగా అమలైందన్నారు. ప్రశ్నలను యాక్సెస్ చేసే అవకాశం కేవలం ఇద్దరు సీనియర్ అధికారులకు మాత్రమే ఉంటుందని తెలిపారు. రోజూ మారే పాస్‌వర్డ్‌లు క్వశ్చన్ బ్యాంక్‌కు సంబంధించిన పాస్‌వర్డ్‌లు ప్రతిరోజూ మారుతాయని, ప్రశ్నలు ఎన్‌క్రిప్టెడ్ రూపంలో ఉంటాయని పేర్కొన్నారు. పరీక్ష రోజు అభ్యర్థులకు జంబుల్డ్ పద్ధతిలో ప్రశ్నలు అందుతాయని చెప్పారు. ఫలితాల ప్రక్రియలోనూ పారదర్శకత డ్రాఫ్ట్ కీ విడుదల అనంతరం అభ్యర్థుల అభ్యంతరాలను స్వీకరించి, తుది కీని ప్రకటించినట్లు తెలిపారు. అన్ని జిల్లాల స్కోర్లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు. విధాన ఉల్లంఘనలకు అవకాశం లేదు టీసీఎస్ అయాన్ కేంద్రాల్లో సీసీటీవీ పర్యవేక్షణ, కఠినమైన భద్రతా ప్రోటోకాల్స్ అమల్లో ఉన్నాయని కోన శశిధర్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే అనేక ప్రతిష్ఠాత్మక పరీక్షలు ఇదే విధానంలో జరుగుతున్నాయని పేర్కొన్నారు. డీఎస్సీ నియామక ప్రక్రియలో ఎక్కడా అవకతవకలకు అవకాశం లేదని, అభ్యర్థులు ఎలాంటి అపోహలకు లోనుకావద్దని విద్యాశాఖ కార్యదర్శి స్పష్టం చేశారు.

# ఆందోళనకరంగా నకిలీ నోట్ల చలామణి

**ఆర్‌బిఐ నివేదికలో పలు అంశాలు వెల్లడి**

**ముంబయి, నేటిధాత్రి:** దేశంలో నకిలీ నోట్ల అంతకంతకూ పెరిగిపోతున్నాయి. దర్యాప్తు అధికారుల సోదాల్లో పెద్ద మొత్తంలో నకిలీ కరెన్సీ పట్టుబడుతుండటమే ఇందుకు నిదర్శనం. బ్యాంకింగ్ వ్యవస్థలో నకిలీ కరెన్సీ నోట్ల గుర్తింపు 2025-26లో 5.7 శాతం పెరిగిందని భారత రిజర్వ్ బ్యాంక్ వెల్లడించింది. దీనికి ఆన్‌లైన లేదా కరెన్సీ రహిత ప్రవాహం పెరగాలని సూచిస్తున్నారు. నోట్ల రద్దు చేసినా నకిలీ నోట్ల ముద్రణ ఆగడం లేదని తెలుస్తోంది. ప్రధానంగా ముఖ విలువ రూ. 200, రూ. 500 ఉన్న నోట్లే ఇందులో ఎక్కువగా వుంటున్నాయని తెలిపింది. 2025-26లో మొత్తంగా నకిలీ నోట్ల సంఖ్య 2,29,746కి పెరిగిందని, అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 2,17,396గా వుందని ఆర్ బి ఐ తన వార్షిక నివేదికలో పేర్కొంది. 2024-25లో నకిలీ రూ. 500 నోట్లు 20.5 శాతం పెరిగాయి. అంతకుముందు 1,17,722 గుర్తించగా, తర్వాత ఆ సంఖ్య 1,41,907కి చేరింది. అలాగే రూ. 20 ముఖ విలువ ఉండే నోట్లు నకిలీ చలామణి కూడా బాగా పెరిగిందని ఆ నివేదిక తెలిపింది. ఏడాది క్రితం 253 నోట్లు బయటపడగా అవి 47.4శాతం పెరిగి 373కి చేరాయి. ఔ. 200 నకిలీ నోట్ల సంఖ్య తగ్గింది. 2024-25లో 32,600 వుండగా, 2025-26లో 30,591కి పడిపోయింది. అలాగే వంద నోట్ల నకిలీ కూడా తగ్గింది. 51,069 నుండి 45,621కి పడిపోయింది. రూ. 50నోట్లు నకిలీ కూడా 12,015 నుండి 10,274కి తగ్గింది. ఔ. 2 వేల నోట్లు చలామణి నుండి ఉపసంహరించడంతో వాటి నకిలీ దాదాపు పడిపోయిందని చెప్పవచ్చు. అంతకుముందు ఏడాదిలో 3508 బయటపడగా, 2025-26లో ఈ సంఖ్య 824కి తగ్గిపోయింది. ఆర్ బి ఐలో 2.4శాతం అంటే 5,412 నకిలీ నోట్లు కనుగొనగా ఇతర బ్యాంకుల్లో మొత్తంగా 97.6శాతం అంటే 2,24,334 నోట్లు కనుగొన్నారని నివేదిక పేర్కొంది. ఇంకా పోలీసులు, ఇతర ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నవి ఇందులో కలపలేదని తెలిపింది. పాడైపోయిన నోట్లను తీసివేయడం బాగా తగ్గిందని నివేదిక పేర్కొంది. 2025-26లో ఈ సంఖ్య 1.72లక్షల నోట్లుగా వుండగా అంతకుముందు ఏడాది ఈ సంఖ్య 2.38 లక్షలుగా వుంది.

# ఐపిఎల్‌లో అరుదైన ఘనత

**వరుసగా రెండుసార్లు హిట్ వికెట్‌గా సాయిసుదర్శన్**

**చండీఘడ్, నేటిధాత్రి:** ఐపీఎల్-2026 సీజన్‌లో రెండుసార్లు సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. వరుస రెండు మ్యాచుల్లో ఇది జరిగింది. బెంగుళూరు, గుజరాత్‌లతో జరిగిన మ్యచ్‌లలో సాయిసుదర్శన్ హిట్ వికెట్‌గా వెనుతిరిగాడు. ఇకపోతే క్వాలిఫయర్-2లో గుజరాత్ టైటాన్స్ మరోసారి సత్తాచాటింది. రాజస్థాన్ రాయల్స్ నిర్దేశించిన 215 పరుగుల భారీ లక్ష్యాన్ని 3 వికెట్లు కోల్పోయి ఛేదించి, బెంగళూరుతో తుదిపోరుకు అర్హత సాధించింది. అయితే.. ఈ మ్యాచ్‌లో జీటీ ఓపెనర్ సాయి సుదర్శన్ ఔటైన తీరే చర్చనీయాంశమవుతోంది. బ్రిజేష్ శర్మ బౌలింగ్‌లో థర్డ్‌మ్యాన్ వైపు బౌండరీ కొట్టిన అనంతరం అతడి చేతిలోని బ్యాట్ జారి నేరుగా వికెట్లను తాకడంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. అంతకుముందు క్వాలిఫయర్-1లో జరిగిన మ్యాచ్‌లోనూ ఆర్సీబీపై ఇదే తరహాలో ఔటయ్యాడు. దీంతో ఐపీఎల్‌లో వరుసగా 2 ఇన్నింగ్స్‌ల్లో హిట్ వికెట్‌గా వెనుదిరిగిన తొలి బ్యాటర్‌గా కోరుకుని రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు సాయి సుదర్శన్. మ్యాచ్ అనంతరం తాను ఔటైన తీరుపై సాయి సుదర్శన్‌కు ఓ ప్రశ్నకు అతడు సరదాగా స్పందించాడు. 'ఇకపై బ్యాట్ చేతికి అతుక్కుని ఉండేలా గ్రిప్ టెక్నిక్‌లు ఏవైనా ఉన్నాయేమో ప్రయత్నించాలి' అని నవ్వుతూ సమాధానమిచ్చాడు. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో ఇన్నింగ్స్ ఆరంభించిన సాయి సుదర్శన్.. తొలి వికెట్‌కు 167 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ చరిత్రలో ఏ వికెట్‌కైనా ఇదే అత్యధికం. గతంలో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మైక్ హస్సీ, మురళీ విజయ్ 159 పరుగులు జోడించగా.. ఆ రికార్డును వీరు అధిగమించారు. అంతేకాకుండా గిల్-సుదర్శన్ జోడీ మరో ఘనతనూ సొంతం చేసుకుంది. టీ20 క్రికెట్ చరిత్రలో అత్యధికంగా 100కు పైగా భాగస్వామ్యాలు నెలకొల్పిన జోడీగా అవతరించింది. వీరిరువురూ 11 సెంచరీ భాగస్వామ్యాలతో.. క్రిస్ గేల్-కోహ్లీ, బాబర్ ఆజమ్-మహ్మద్ రిజ్వాన్, డివిలియర్స్-కోహ్లీ జోడీలను వెనక్కి నెట్టారు. క మ్యాచ్ విషయానికొస్తే.. 215 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో గిల్(53 బంతుల్లో 104) అద్భుత శతకంతో మెరిశాడు. మరోవైపు సాయి సుదర్శన్ 32 బంతుల్లో 58 పరుగులతో చెలరేగాడు. వీరి దూకుడుకు రాజస్థాన్ బౌలర్లు పూర్తిగా చేతులెత్తేశారు. జీటీ చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం. అంతకుముందు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆరఆర్ 20 ఓవర్లలో 214/6 పరుగులు చేసింది. 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ 47 బంతుల్లో 96 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆకట్టుకోగా.. రవీంద్ర జడేజా 45 పరుగులతో రాణించాడు.




చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888

# అయ్య బాబోయ్ "హై రైజ్" బిల్డింగులు!



## రోగాలు కొంపలు... ఉపిరాడని పిట్టల గూళ్లు!!

## ఆకాశంలో విశాలం కాదు..గుడిసెల్లో వున్న ఆరోగ్యం కూడా ఉండదు




- భూ మీద కొనుక్కునే నరకానికి నకళ్ళు!
- కోట్లు పెట్టి కొనుక్కునే అనారోగ్య కేంద్రాలు.
- దుర్వాసన దూపాలు.. కంపుకు నిలయాలు.
- సౌకర్యాలు చచ్చు బండలు... ఉక్కపోతకు ఆవిరి బండ్లు.
- కొలిమి మంటకు స్వయంగా బంధువులు.
- చలి కాలం కూడా హాయి లేని నిద్రలేమి రాత్రులు!
- చూడడానికే ఆకాశ హ్రమ్యాలు..సమస్యల తోరణాలు.
- ఆరోగ్యంగా ఉన్నవారు పిలిచి రోగాలు కొని తెచ్చుకుంటారు.
- పేరుకే సకల సౌకర్యాలు... ఎంత సంపద వున్నా సుఖం లేని బతుకులు.
- గాలి కాలుష్యం, నీటి కాలుష్యం జీవితమంతా కంపుతో సహవాసం.
- బిల్డింగ్ మాత్రమే అందం.. లోపలికి అడుగు పెడితే అంతా వికారం.
- అలవాటు పడితే తప్ప ఆ జీవితం అగమ్య గోచరం.
- ఎంత ఎత్తులో వున్నా దోమలు, ఈగలకు ద్వారాలు తెరిచే స్వాగతం.
- అద్దాల మేడల్లో వున్నా ఆగమే వారి జీవితం.
- కొనుక్కున్న వారు పడుతున్న కష్టం పగవాడికి కూడా వద్దనేంత వేదాంతం.



## బతికుండగానే ఇదేం బతుకురా అని నేర్పించే అద్వైతం.

హైదరాబాద్, నేటిధాత్రి:

హైదరాబాద్ అంటే ఆ మాత్రం వుంటుంది. ఎటు చూసినా ఆకాశాన్ని తాకేంతటి పెద్ద పెద్ద అప్పార్టుమెంట్లు కనిపిస్తుంటాయి. కాని వాటిని అప్పార్టుమెంట్లు అనడం లేదు. అందంగా హై రైజ్ బిల్డింగులు అంటున్నారు. రోడ్డు పక్కనే ఆకాశాన్ని తాకుతున్నాయా? అని అనిపించేంత అందంగా వుంటాయి. నిజంగానే ఆ హై రైజ్ బిల్డింగ్‌లలో జీవితాలు అందంగా వుంటాయా? ఆహ్లాదంగా వుంటాయా? ఆరోగ్యంగా వుంటాయా? అంటే జీవితంలో కొన్ని చూడడానికి మాత్రమే పనికి వస్తాయి? అందంగా కనిపించే హై రైజ్ బిల్డింగుల జీవితాలు కూడా అంతే అని చెప్పకతప్పదు. పైకి కనిపించేంత అందమైన బతుకులు వారిలో వుంటాయని ఊహించుకోకండి. ఊహలకందని జీవితాలు అనుభవించాలనే రాసి వుంటేనే అందులో బతుకుతారని కూడా అనుకోకండి. ఎందుకంటే కోట్లు పెట్టి కొనుక్కునే రోగాల కుంపట్లు ఆ హై రైజ్ బిల్డింగులు. ఆశలకు పోయి కొనుక్కునే నరక కూపాలు. కాలం విదించే శిక్షలకు కార్ఖానాలు. అవును. అందులో జీవిస్తున్న వారు ఏడ్వలేక చెబుతున్న మాటలు. పైగా పక్కపక్కనే కొన్ని వుండే ఆ హై రైజ్ బిల్డింగుల వల్ల ఎదురయ్యే సమస్యలు రాస్తే రామాయణం పెద్దదౌతుంది. వింటే భారతం కనిపిస్తుంది. అందులోనే అన్నీ వికారాలు వుంటాయి. ఆకాశంలో విహరిస్తున్నట్లు జీవితాలు వుంటాయని కోట్లు పెట్టి కొనుక్కుంటారు. కాని ఊపిరాడని జీవితాలను కొని తెచ్చుకుంటారు. పొల్యూషన్ ఫ్రీ అని చేసే ప్రచారం నమ్ముతుంటారు. నిజమైన భరించలేని కాలుష్యం ఎదుర్కొంటారు. భూమి మీద నుంచి వెళ్లే కాలుష్యమంతా ఆ హై రైజ్ బిల్డింగుల పై నుంచి వెళ్లలేక అందులో దూరిపోతుంది. వారి బతుకులు నకరం చేస్తుంది. అది దుమ్మైనా, దూళి అయినా, ఆఖరుకు విషవాయులైనా సరే వారు పీల్చుకోవాల్సిందే. నరకం అనుభవించాల్సిందే. అంత ఘోరంగా హై రైజ్ బిల్డింగుల జీవితాలుంటాయి. ఒక్క మాటలో చెప్పాలంటే అవి ఊపిరి కూడా ఆడనటువంటి పిట్ట గూళ్లు నయమని కొనుక్కొని అనుభవిస్తే గాని అర్థం కాదు. పైకి ఎంతో అందంగా విశాలంగానే కనిపిస్తుంటాయి. ఎందుకంటే కోట్లు పెట్టి కొన్న తర్వాత అదో అందమైన ప్రపంచం మాత్రమే అనుకోవాలి. అందవిహీనమైన జీవితాలను బహుమతిగా పొందాలి. హైరేజ్ బిల్డింగులు రోగాల కూపాలు అనే సంగతి కొన్న తర్వాత గాని తెలియదు. నిర్మాణం చేసేవారు చెప్పరు. ప్రచారంలో ఎక్కడా ఆ మాట చెప్పరు. ఉన్నతమైన జీవితాలకు నిలయాలుగా మాత్రమే ఊదరగొడతారు. వాటిని నమ్మి కొనుగోలు చేసుకొని నరకాలు అనుభవిస్తున్నారు. స్వచ్ఛమైన గాలి అందుతుందని కలలుకంటారు. కాని కాలుష్యం పీల్చుకోవాల్సి వుస్తుందని ఊహించరు. నిర్మాణ దారుల చెప్పరు. వందలకోట్లు పెట్టి నిర్మాణం చేస్తున్నామని మాత్రమే చెబుతారు. అది నమ్మి కోట్లు పెట్టి కొనుక్కుంటారు. సకల సౌకర్యాలు వుంటాయి. వాటితోపాటు సమస్యలు కూడా వుంటాయి. అందులోనే అన్నీ వుంటాయంటారు. అందుకే ఆసుపత్రులు కూడా వుంటాయి. ఆర్యోగ్యంగా వుండాల్సిన ప్రాంతాలలో ఆసుపత్రులు వెలుస్తున్నాయి అంటేనే ఎక్కడో తేడా జరుగుతుందన్న సత్యాన్ని మాత్రం గ్రహించరు. ఒకప్పుడు హైదరాబాద్‌లో వుండే ఆసుపత్రులు ఎన్ని? ఇప్పుడు వున్న ఆసుపత్రులు ఎన్ని? నగరం పెరుగుతున్న కొద్దీ ఆసుపత్రులు కూడా పెరుగుతూ వచ్చాయి. అంటే ఆరోగ్యం జనం దగ్గరకు వస్తున్నట్లు లెక్క కాదు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారని అర్థం. అలాగే హై రైజ్ బిల్డింగుల్లోనూ ఆసుపత్రులు వుండాల్సి వస్తుందంటే అన్ని సౌకర్యాలు అతి దగ్గర వున్నట్లు కాదు. అనారోగ్యాలను దరి చేసుకుంటున్నామన్న సంగతి మర్చిపోతున్నారు. ప్రతి హై రైజ్ బిల్డింగ్‌లో కొన్ని వేల మంది నివాసాలు వుంటున్నారు. అంటే కొన్ని వందల ఎకరాల్లో విస్తరించి వుండే గ్రామ జనాభా కొన్ని వందల గజాల్లో నివాసముంటున్నారు. ఒకరి నెత్తి మీద మరోకరు అన్నట్లు ఆవాసాలు కొనుక్కుంటున్నారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే గాలి, నీరు, మురుగునీరు వానసలు ప్రతి బిల్డింగును పలకరిస్తూ పోతుంటాయి. ఆ వాసన వదిలిపెడుతూ వెళ్తుంటాయి. నీళ్లయితే నేరుగా కిందికి వెళ్తుంటాయోమో గాని వాసన మాత్రం అందిరికి వదులుతూ, పంచుతూ వెళ్తుంది. ఆ దుర్వాసనలను ప్రతి క్షణం పీల్చుకుంటూ బతుకుతుంటారు. దుర్వాసనతోనే దూపాలు వేసుకున్నట్లు పీల్చికుంటారు. ఆరోగ్యాలు పాడు చేసుకుంటారు. అది పైకి కనిపించని అనార్యోన్ని ముందు పరిచయం చేసుకుంటూ వుంటారు. అంతకు ముందు లేని అనారోగ్య సమస్యలు మెల్లిగా ఒంటికి చేరుతుంటాయి. అదంతా హై రైజ్ బిల్డింగ్‌లో బతుకుతున్నందన వస్తుందన్న ఆలోచన చేయరు. వయసు పెరుతుందన్న ఆలోచనతో నిజాన్ని తెలుసుకోరు. ఒక్క పూట ఆ కాంపౌండ్‌లో పనిచేసే కార్మికులు పనికి విరామం ఇస్తే ఇక అంతే గతి. అందుకే ఆసుపత్రుల్లో ఎప్పుడూ కార్మికులు ఫినాయిల్‌తో క్లీన్ చేస్తుండడం చూస్తుంటాం. సరిగ్గా హై రైజ్ బిల్డింగుల్లోనూ కార్మికులు ప్రతి క్షణం పని చేస్తూనే వుంటారు. పైన పటారం లోన లొటారం క్లీనింగ్‌తో వచ్చే లాభం ఏమీ వుండదు. ఐదంతుస్తుల ఆసుపత్రుల్లోనే రోజంతా క్లీన్ చేసినప్పుడు, హై రైజ్ బిల్డింగుల్లో ఎంత క్లీన్ చేసినా కంపు పోతుందా? దుర్వాసనలు ఆగుతాయి? మనుషుల ఉచ్వాస, నిశ్వాస నుంచి మొదలు, అంతా కాలుష్యమే. అంతటా కంపు ప్రాంతమే? అన్ని రకాల సౌకర్యాలు వుంటాయని మురిసిపోయినంత కాలం కూడా అందులో చేరిన వారు ఆరోగ్యంగా వుండరు. ఆ వాతావరణంలోకి చేరుకున్నకొద్ది రోజులకే వారి ఒంటిలోమార్పులు చూస్తారు. రకరకాల సమస్యలు ఆరోగ్య సమస్యలు ఎదురుకావడం గమనిస్తారు. ఓవైపు ఉక్కపోతలు, మరో వైపు దుర్వాసనలు చూస్తుంటారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎండా కాలం వచ్చిందంటే చాలు కొలిమి మంటలను చూస్తారు. ఎల్లప్పుడూ ఏసిలు లేకుండా బతకలేదు. హై రైజ్‌బిల్డింగుల్లో చేరక ముందు స్వచ్ఛమైన గాలిని పీల్చుకుంటామని అనుకుంటారు. కాని అసలు స్వచ్ఛత అంటే మర్చిపోయి బతుకుంతుంటారు. ఎప్పుడూ ఇంట్లోనుంచి బైటకు వెళ్లిపోదామా? అని జనం చూస్తుంటారు. కొనుక్కున్న ఖర్మానికి బకలాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. కోట్లు పెట్టి కొనుక్కున్న హై రైజ్ బిల్డింగులు అమ్మకోలేరు. అవి వదిలేసి వెళ్లిపోలేరు. అంతలా నరకం చూస్తారు. చలి కాలం కూడా హాయిగా నిద్రపోని రాత్రులు చూస్తారు. ఆరోగ్యంగా వున్న వారు కోట్లు ఖర్చు చేసి, పిలిచి పిలిచి రోగాలను తెచ్చుకుంటారు. ఆరోగ్యమే మహాబాగ్యమని చదువుకున్న వాళ్లు కూడా కోట్లు పోసి అనారోగ్యాన్ని కోరి తెచ్చుకున్నామని ఆందోళన చెందుతున్నారు. హాయిగా అందమైన ఊహా లోకలంలాగా జీవితం గడపాలని కలలు కని, ఆరోగ్యాలు పాడై, అయితే ఆసుత్రుల్లో లేకుంటే మురికి కూపంలో బతకాల్సి వస్తుందన్న సత్యాన్ని గ్రహిస్తున్నారు. చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకుంటే వచ్చే లాభమేమీ వుండదు. ఎంత సంపద వున్నా సుఖం లేని జీవితాలు కోరి కోరి తెచ్చుకోవడం అంటే హై రైజ్ బిల్డింగులు కొనుక్కోవడమే అంటున్నారు. పైకి ఎంతో అంతంగా కనిపించినా, లోపల వారి జీవితాలు ఎంతో వికామైపోతున్నాయి. అవి కొనుక్కున్న వారు పడుతున్న కష్టం పగవాడికి కూడా వద్దనేంత వేదాంతం ప్రతి ఒక్కరిలోనూ అబ్బుతుంది. బతికుండగానే ఇదేం బతుకురా? అని అనిపించేంత అద్వైతం కూడా అనుభవించాల్సి వస్తుంది. ఇంత చెప్పినా హై రైజ్ బిల్డింగ్ స్టేటస్ సింబల్ అనుకుంటే మీ ఖర్మ???

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి,చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ, నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444




"నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ, నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

# నేటిధాత్రి 9 NETI DHATHRI



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు
ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్‌ని
"పాఠక దేవుళ్ళ కోసం " " శక్తి బ్రాడ్ కాస్టింగ్స్ " ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటక సంతోషిస్తున్నాము.

"నేటిధాత్రి" పత్రికను ఆదరించిన
విధంగానే "నేటిధాత్రి 9"
" యూట్యూబ్ ఛానల్ " కూడా
ఆదరిస్తారని కోరుకుంటూ....



మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444



మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

**Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03**
**Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034**




# "నేటిధాత్రి" 22వ వసంతపు తోరణం

చరిత్రను చెప్పాలన్నా , ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది "అక్షరం"

"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో "21 మైలు రాళ్ళు" దాటుకొని ముందుకు సాగుతూ , తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని , తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ
పత్రికా ప్రయాణం సాగిస్తూ "22 వ వసంతం" లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.
"నేటిధాత్రి" అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన , అందిస్తున్న సహాయ , సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....

22th ANNIVERSARY 2004-2025 వసంతాల అక్షరోద్యమం

మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999

ఆరోగ్య ధాత్రి



# మైండ్ డైట్‌తో జీవనశైలి వ్యాధులకు చెక్

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఆధునిక జీవనశైలితో వ్యాధుల ముప్పు పెరిగిపోతుండటంతో పెద్దసంఖ్యలో ప్రజలు తమ ఆరోగ్య అలవాట్లను (Health Tips) మార్చుకుంటూ కఠిన ఆహార నియమాలు, డైట్ ప్లాన్‌లను అనుసరిస్తున్నారు. కీటో నుంచి డ్యాష్, మైండ్, మెడిటేర్రేనియన్ వంటి ఎన్నో డైట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్కరి ఫిట్‌నెస్ లక్ష్యాలు, ఆరోగ్యపరమైన అంశాల ఆధారంగా ఒక్కో డైట్ ప్లాన్ అనుసరించాల్సి ఉంటుంది. ప్రతి డైట్ ప్లాన్‌కూ ప్రయోజనాలతో పాటు ప్రతికూలతలూ ఉండటంతో పలువరు తరచూ తమ డైట్ ప్లాన్‌లను మార్చుతుంటారు.
ఇక హృద్రోగం నుంచి మధుమేహం, అధిక రక్తపోటు వరకూ పలు వ్యాధులను నివారించడంతో పాటు నియంత్రించే శక్తి కలిగిన డైట్‌గా మైండ్ డైట్ ప్రాచుర్యం పొందుతోంది. మెడిటెర్రేనియన్, డ్యాష్ డైట్లను మేళవిస్తూ కొన్ని మార్పులతో మైండ్ డైట్ ముందుకొచ్చింది. ఈ డైట్ ప్లాన్ ప్రధానంగా మొక్కల ఆధారిత ఆహారంతో డిజైన్ చేయబడింది. ఈ డైట్‌లో జంతు సంబంధ ఆహారాన్ని పరిమితం చేయడం, సంతృప్త కొవ్వులు, అదనపు చక్కెరలతో కూడిన ఆహారానికి దూరంగా ఉండాలి. ఇక మైండ్ డైట్ ప్రధానంగా బరువు తగ్గడంపై కాకుండా గుండె ఆరోగ్యం, మధుమేహం, మెదడు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంపై ఫోకస్ చేస్తుంది. నిర్ధిష్ట క్యాన్సర్ల నివారణకు మైండ్ డైట్ ఉపకరిస్తుందని నిపుణులు చెబుతున్నారు. మైండ్ డైట్‌లో మనం తీసుకునే ఆహారం మితంగా ఉండటంపై ఫోకస్ పెట్టాల్సి ఉంటుంది. మైండ్ డైట్‌ను అనుసరించడంతో శరీరంలో వాపు ప్రక్రియను నివారించవచ్చు. ఫైబర్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, విటమిన్లు, మినరల్స్, పైటో కెమికల్స్, ఆరోగ్యకర కొవ్వులతో కూడిన ప్లాంట్ బేస్డ్ ఆహారంతో హృద్రోగాల ముప్పు తగ్గుతుంది. కొలెస్ట్రాల్ కూడా తగ్గడంతో పాటు మధుమేహం, ఊబకాయం, రక్తపోటు వంటి సమస్యలు అదుపులోకి వస్తాయి.

# అరటి ఆకుల్లో భోజనం చేస్తే శరీరానికి ఎంత మేలంటే..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
అరటి ఆకుల్లో భోజనం చేయడం భారతీయుల్లో అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఆధునిక బిజీ లైఫ్‌లో అరిటాకు భోజనాలు అరుదైనా ఇప్పటికీ పల్లెల్లో, పండుగలు, శుభకార్యాల్లో అరటి ఆకుల్లో భోజనం వడ్డించడం చూస్తుంటాం. అరటి ఆకును ప్లేట్‌లా ఉపయోగిస్తూ ఆహార పదార్ధాలను వడ్డించడం దక్షిణాసియా దేశాల్లోనూ సంప్రదాయంగా వస్తోంది. అరటి ఆకులు సహజసిద్ధమైనవే కాకుండా బయోడీగ్రేడబుల్, విస్తృతంగా అందుబాటులో ఉండటం, పర్యావరణహితమైనవి కావడంతో వీటి వాడకం మేలైనదని నిపుణులు చెబుతున్నారు.
అంతేకాకుండా అరటి ఆకులు వాటర్ ప్రూఫ్ కావడంతో వీటిలో భోజనం చేయడం సౌకర్యవంతంగా ఉంటుంది. అరటి ఆకులో భోజనం చేయడం వంటకాల రుచిని, ఫ్లేవర్‌ను పెంచుతుంది. ఇక అరటి ఆకుల్లో భోజనం చేయడం ద్వారా ప్రయోజనాలను పరిశీలిస్తే అరటి ఆకులు సహజమైన డిస్‌ఇన్ఫెక్టెంట్‌గా చెబుతారు. ఇవి ఆహారంలో ఉన్న హానికారక బ్యాక్టీరియా నశించేలా చేస్తాయి.
అరటి ఆకుల్లో పాలీపెనాల్స్, విటమిన్ ఏ, విటమిన్ సీ వంటి అత్యవసర పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. అరటి ఆకుపై భోజనం వడ్డించగానే



ఆకులోఉండే ఈ పోషకాల్లో కొన్ని ఆహారంలోకి చేరతాయి. కొన్ని సింథటిక్ ప్లేట్లతో పోలిస్తే అరటి ఆకులు ఎలాంటి టాక్సిన్స్‌ను, హానికారక కెమికల్స్‌ను ఆహారంలోకి విడుదల చేయవు. అరటి ఆకుల్లో భోజనం చేయడం ద్వారా జీర్ణక్రియ సజావుగా సాగుతుంది. అరటి ఆకుల్లో ఉండే పాలీపెనాల్స్ డైజెస్టివ్ ఎంజైమ్స్‌ను ప్రేరేపించడం ద్వారా జీర్ణక్రియను మెరుగుపరిచి పోషకాలను మెరుగ్గా గ్రహించేలా చేస్తాయి.

# పచ్చికొబ్బరి చేసేమేలు తెలుసా..?



పచ్చి కొబ్బరి..! కొంతమంది ఈ పచ్చికొబ్బరిని చాలా ఇష్టంగా తింటారు. అల్పాహారాల్లో వేసుకునే చట్నీగా, తీపి వంటకంగా పచ్చికొబ్బరిని వినియోగిస్తుంటారు. అయితే, కొంతమంది మాత్రం దగ్గు వస్తుందని, బరువు పెరుగుతామని భయంతో ఈ పచ్చి కొబ్బరిని దూరం పెడుతారు. కానీ, నిపుణులు మాత్రం పచ్చి కొబ్బరితో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. పచ్చి కొబ్బరిని తరచూ తగిన మోతాదులో తీసుకుంటే చాలా అనారోగ్య సమస్యలు దూరమవుతాయంటున్నారు. పచ్చి కొబ్బరి యాంటీ బయోటిక్ గా పని చేస్తుందని, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మ, జుట్టు సమస్యలను తగ్గించడంలో తోడ్పడుతుందని సూచిస్తున్నారు. మరి పచ్చి కొబ్బరితో ఉండే ఆ లాభాలేమిటో ఒకసారి తెలుసుకుందామా..?

రోగ నిరోధక శక్తి
పచ్చి కొబ్బరిని వీలైనప్పుడల్లా తింటూ ఉంటే శరీంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దాంతో శరీరం వైరస్, బ్యాక్టీరియాలతో సమర్థంగా పోరాడుతుంది. ఇన్‌ఫెక్షన్‌ల బారినపడే ప్రమాదం తప్పుతుంది.

### మంచి కొలెస్ట్రాల్
పచ్చి కొబ్బరిని తరచూ తీసుకోవడం వల్ల శరీరంలో మంచి కొలెస్ట్రాల్ స్థాయిలు పెరుగుతాయి. దాంతో రక్తంలో ఎలాంటి మలినాలు ఏర్పడవు. గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది.

### జీర్ణ శక్తి
పచ్చి కొబ్బరిలో పీచు పదార్థం (ఫైబర్) ఎక్కువగా ఉంటుంది. కాబట్టి తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. దాంతో జీర్ణ సమస్యలు కూడా త్వరగా రావు. అలాగే మలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది.

### అదుపులో థైరాయిడ్
చాలా మంది థైరాయిడ్ సమస్యతో బాధ పడుతూంటారు. ఇలాంటి వారికి పచ్చి కొబ్బరి బాగా సాయపడుతుంది. పచ్చి కొబ్బరిలో ఉండే పోషకాలు థైరాయిడ్ ను తగ్గిస్తాయి.

### మెదడు ఆరోగ్యం
తరచూ పచ్చి కొబ్బరి తినడం వల్ల మెదడు ఆరోగ్యంగా పని చేస్తుంది. అల్జీమర్స్ లాంటి సమస్యలు రాకుండా ఉంటాయి.

### పిల్లల ఎదుగుదలకు
ఎదిగే పిల్లలకు పచ్చి కొబ్బరి చాలా మేలు చేస్తుంది. పచ్చి కొబ్బరిలో వారికి కావాల్సిన పోషకాలు అందుతాయి. దాంతో పిల్లల్లో ఎదుగుదల చక్కగా ఉంటుంది. రక్త హీనత సమస్య తగ్గుతుంది. అలాగే చిన్న వయసులోనే ఎముకలు, కండరాలు గట్టిపడతాయి. కావాల్సిన శక్తి లభిస్తుంది.

### చర్మం, కేశాల ఆరోగ్యం
పచ్చి కొబ్బరి తరచూ తినడం వల్ల చర్మం, కేశాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతమవుతుంది. వృద్ధాప్య ఛాయలు దరి చేరకుండా ఉంటాయి. జుట్టు రాలడం ఆగిపోతుంది.

# ఉపవాస వేళ ఇలా చేస్తే ఆరోగ్యకరం..!



**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
రోజు ఉపవాసం ఉండే భక్తులు కొన్ని సూచనలు పాటించాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఉపవాసం ద్వారా శరీరం డీటాక్సిఫికేషన్ అవడంతో పాటు బరువు పెరగకుండా చూసుకోవడం, జీవక్రియల వేగం పెరగడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయి. అయితే ఆరోగ్యపరమైన సమస్యలు దరిచేరకుండా ఉపవాసం చేయడం మేలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. పండుగల సమయంలో ఉపవాస వేళ ఎంపిక చేసుకునే ఆహార పదార్ధాల విషయంలో జాగ్రత్త వహించాలి.
ప్రొటీన్ అధికంగా ఉండే ఆహారాన్ని ఉపవాస దీక్షకు ముందు ఉపవాసం ముగిసిన తర్వాత తీసుకోవాలి. ఎనర్జీని రోజంతా కొనసాగించేందుకు బాదం, పనీర్, కర్డ్, నట్స్ వంటివి తీసుకోవాలి. బాదంలో ప్రతి 30 గ్రాముల్లో 6 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఇవి ట్రాన్స్‌ఫాట్స్ లేకుండా, ఆరోగ్యకర మోనోఅన్‌శాట్యురేటెడ్ కొవ్వులను కలిగిఉంటాయి. బాదం గుండె ఆరోగ్యానికి మేలు చేయడంతో పాటు చర్మం మెరిసేందుకు, మధుమేహ నియంత్రణకు మేలు చేస్తాయి.
ఉపవాసం విరమించే క్రమంలో ముందుగా నీరు తీసుకుని ఆపై తేలికపాటి ఆహారం తీసుకోవాలి. ప్రొటీన్లు, ఫైబర్, ఆరోగ్యకర కొవ్వులతో కూడిన సమతులాహారం తీసుకోవాలి. పండుగ వేళ స్వీట్లు అతిగా తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ పెరిగే ముప్పు ఉండటంతో డేట్స్ వంటి సహజమైన స్వీటెనర్స్ తీసుకోవడం మేలు. ఉపవాసం ఉండే సమయంలో శరీ
శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలి. తగినంత నీరు తరచూ తీసుకోవాలి.

# హెల్దీ పావ్‌బాజీ ఇలా ట్రై చేయండి..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
పావ్‌బాజీ అంటే పిల్లలు, పెద్దలు అందరూ ఇష్టంగా తింటారు. అయితే ఇందులో వెన్న అధికంగా వాడటంతో పోషకాహార విలువల పరంగా దీనికి తక్కువ రేటింగ్ ఇస్తారు. దీన్ని తరచూ తింటే బరువు పెరగడం నుంచి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంది.
అలాగని మన ఫేవరెట్ స్ట్రీట్ ఫుడ్‌ను పూర్తిగా పక్కనపెట్టాల్సిన పనిలేదు. ఎప్పుడైనా ఒకసారి పావ్‌బాజీని ఎంజాయ్ చేయవచ్చు. అయితే ఇంట్లోనే పావ్‌బాజీని తయారుచేసుకుని తీసుకుంటే ఎలాంటి సంకోచం లేకుండా ఎంచక్కా తినేయవచ్చు. రుచితో రాజీపడకుండానే పావ్‌బాజీని ఆరోగ్యకరమైన స్నాక్‌గా మనం ప్రిపేర్ చేసుకోవచ్చు.
స్ట్రీట్‌ఫుడ్‌లో పావ్‌బాజీ తయారీలో అధికంగా నెయ్యి, వెన్న వాడుతుంటారు. వీటిలో ఉండే అనారోగ్యకర కొవ్వులు శరీరానికి హాని చేస్తాయి. మైదాతో దీన్ని చేయడం వల్ల కొలెస్ట్రాల్ పెరగడం, బరువు పెరగడం వంటి ఆరోగ్యపరమైన సమస్యలు ఎదురవుతాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ టేస్టీ స్నాక్‌గా పావ్‌బాజీని ఇంట్లోనే ఇలా తయారుచేసుకుంటే ఎలాంటి సమస్యలు ఎదురవకుండా ఫేవరెట్ స్నాక్‌ను ఎంజాయ్ చేయవచ్చు.



**వెన్న వాడకాన్ని తగ్గించాలి**
**అధికంగా కూరగాయల వాడకం**
**మైదా బదులు గోధుమ పిండితో పావ్స్**
**ఉప్పు వాడకం తగ్గించాలి**
**సలాడ్‌తో కలిపి సర్వ్ చేయాలి**

# ఈ ఆహారంతో ఒత్తైన జుట్టు మీ సొంతం


**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
ఆరోగ్యకరమైన ఒత్తైన వెంట్రుకలు కావాలని కోరుకోని వారుండరు. కొందరికి సహజంగా ఒత్తైన జుట్టు వస్తే మరికొందరు అందుకోసం చేయని ప్రయత్నం అంటూ ఉండదు. కేశ సంపద పెంచుకునేందుకు చాలామంది కేశ సంరక్షణ ప్రోడక్ట్స్‌పై పెద్దమొత్తంలో ఖర్చు చేస్తుంటారు.
అయితే కృత్రిమ ప్రోడక్ట్స్‌ను వాడటం కంటే సహజ ఉత్పత్తులు, పదార్ధాలతో ఒత్తైన జుట్టును సొంతం చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. కొన్ని ఆహార పదార్ధాలతో మన వెంట్రుకల ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చు. గుడ్ల నుంచి తృణధాన్యాలు, పాలకూర వంటి ఎన్నో ఫుడ్స్ కేశ సంరక్షణకు ఉపయోగపడతాయి. ఎగ్స్ ఆరోగ్యకరమైన కేశ సంపదను సమకూరుస్తాయి. ఎగ్స్‌లో ఉండే విటమిన్ ఏ, ఈ, బయోటిన్, ఫోలెట్ ఒత్తైన జుట్టుతో మెరిసేలా చేస్తాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం, లేదా హెయిర్ మాస్క్‌లా వాటిని అప్లై చేయడం ద్వారా మెరుగైన ఫలితాలు పొందవచ్చు. ఒత్తైన కేశాలను పొందాలంటే ఎలాంటి ఆహారం తీసుకోవాలాంటే..



ఎగ్స్
నట్స్
పాలకూర
ఉసిరి
డైరీ ప్రోడక్ట్స్

# మొక్కల ఆధారిత డైట్‌ను ఇలా సెట్ చేసుకోండి..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
ప్లాంట్ బేస్డ్ డైట్ పేరుకు తగ్గట్టే మొక్కల నుంచి సేకరించిన ఆహారం ఆరోగ్యానికి మేలైనదని పలువురు ఈ డైట్‌ను ఫాలో అవుతుంటారు. మాంసం, పౌల్ట్రీ, డైరీ ఉత్పత్తులను పక్కనపెట్టి మొక్కల ఆధారిత ఆహారాన్ని ఎంచుకునే వారు పెరుగుతున్నారు. ఈ తరహా ఆహార నియమాలను అనుసరించేవారు వారానికి తగిన ప్రణాళికతో ముందుకెళితే ఆహార పదార్ధాల ఎంపిక సులువవుతుంది.
వీక్లీ మీల్ ప్లాన్ రూపొందించుకుని అందుకు అనుగుణంగా అవసరమైన పదార్ధాలు, సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. వారంలో ప్రతి రోజూ బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్‌కు ఏమేం తీసుకోవాలో ఎంపిక చేసుకోవడం మేలు. ఈ క్రమంలో పలు రకాల పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు, మొక్కల ఆధారిత ప్రొటీన్లను భాగం చేసుకోవాలి. వారానికి సరిపడా అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు లిస్ట్ తయారుచేసుకోవాలి.



తాజా సరుకులను, తోఫు, లెంటిల్స్, నట్స్ వంటి మొక్కల ఆధారిత ప్రొటీన్‌లను సిద్ధం చేసుకోవాలి. ఇక ప్రాసెస్డ్ ఫుడ్ స్థానంలో పండ్లు, కూరగాయలు, హోల్ గ్రెయిన్స్, నట్స్, సీడ్స్‌ను ఎంపిక చేసుకోవాలి. మీరు తీసుకునే మొక్కల ఆధారిత ఆహారంలో శరీరానికి అవసరమైన ప్రొటీన్, ఐరన్, క్యాల్షియం, ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బీ12 వంటి పోషకాలు ఉండేలా చూసుకోవాలి.

# లెమన్ వాటర్ ఆరోగ్యానికి మేలు చేసినా పరిమితి మించితే..!

**న్యూఢిల్లీ ,నేటిధాత్రి:**
రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం తీసుకుంటే బరువు తగ్గడం, జీర్ణవ్యవస్థ మెరుగవడడం నుంచి విటమిన్ సీ అందడం వరకూ ఎన్నో ఆరోగ్య ప్రయోజాలు ఉన్నాయని చెబుతుంటారు. అయితే లెమన్ వాటర్‌ను మితంగా తాగుతూ ఆరోగ్య సమస్యలను బ్యాలెన్స్ చేస్తూ ఉండాలని అతిగా తీసుకుంటే ఆరోగ్యానికి అనర్ధదాయకమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నిమ్మరసం అతిగా తాగితే గ్యాస్, అసిడిటీ సమస్యలు ఉన్నవారికి మరింత ఇబ్బంది ఎదురవుతుంది.
నిమ్మకాయల్లో సిట్రిక్ యాసిడ్ ఉండటంతో ఎక్కువగా తీసుకుంటే అసిడిటీ లెవెల్స్ పెరిగి జీర్ణసమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక లెమన్ వాటర్ రుచిగా ఉన్నా పంటి ఆరోగ్యానికి ఇది మంచిది కాదు. రోజూ నిమ్మరసం తీసుకుంటే అందులో ఉండే ఆమ్లాలు పన్నును మరింత సెన్సిటివ్‌గా మార్చుస్తాయి. ఎనామిల్‌ను కాపాడుకునేందుకు నిమ్మరసాన్ని తరచూ తీసుకోకుండా జాగ్రత్తపడాలి. లెమన్ వాటర్ తీసుకుంటే శరీరం డీహైడ్రేషన్‌కు లోనవదని చెబుతుంటారు. ఇది నిజమే అయినా నిమ్మరసం అధికంగా తీసుకుంటే ఇందుకు విరుద్ధమైన ఫలితాలు కనిపిస్తాయి. నిమ్మరసంలో ఉండే డీటాక్సిఫైయింగ్ పదార్ధాలతో శరీరంలో కీలక ఎలక్ట్రోలైట్స్ విసర్జించబడి డీహైడ్రేషన్‌కు దారితీస్తుంది. ఇక లెమన్



వాటర్‌లో ఆమ్లాలు ఎక్కువగా ఉండటం వల్ల దీన్ని అధికంగా తీసుకుంటే ఎముకల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. నిమ్మరసాన్ని మితంగా తీసుకుంటే ఈ ఇబ్బందిని అధిగమించవచ్చు. నిమ్మరసం తీసుకుంటే కొందరిలో అల్సర్, హార్ట్‌బర్న్ వంటి ఇబ్బందులు తలెత్తవచ్చు. ఏదైనా లెమన్ వాటర్ పూర్తి ప్రయోజనాలను పొందాలంటే పరిమిత మోతాదులో తీసుకుంటూ సమతూకం పాటించడం మేలని నిపుణులు సూచిస్తున్నారు.

# మెగ్నీషియం లోపిస్తే శరీరంలో ఏం జరుగుతుంది..

## ఈ లోపానికి చెక్ పెట్టాలంటే..!

**న్యూఢిల్లీ,నేటిధాత్రి:**
సమతులాహారం లోపిస్తే శరీరం పలు వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు లోనవుతుంది. హైపోమెగ్నీషిమియాగా పేరొందిన మెగ్నీషియం ) లోపంతో ప్రపంచవ్యాప్తంగా పెద్దసంఖ్యలో ప్రజలు బాధపడుతున్నారు. కండరాలు, నాడీ వ్యవస్థ పనితీరు, ఎనర్జీ ప్రొడక్షన్, ఎముకల ఆరోగ్యానికి మెగ్నీషియం తగిన మోతాదులో ఉండాలి.
మెగ్నీషియం లోపం తలెత్తితే ఒళ్లు నొప్పులు, తీవ్ర అలసట, బలహీనత, నీరసం, గుండె దడ, వాంతులు, వికారం, కుంగుబాటు, ఆస్టియోపోరోసిస్ వంటి లక్షణాలు వేధిస్తాయి. మెగ్నీషియం లోపాన్ని నివారించేందుకు ఆహారంలో మెగ్నీషియం తీసుకోవాలి. ఇది శరీరంలో ఆమ్లాలను ప్రేరేపించి మెగ్నీషియంను శరీరం సంగ్రహించేలా చేస్తుంది. మెగ్నీషియంతో పాటు క్యాల్షియం సప్లిమెంట్లను తీసుకోవడం నిలిపివేయాలి.
తగినంత నీరు తీసుకుంటే మెగ్నీషియంతో పాటు పోషకాలను శరీరం సంగ్రహిస్తుంది. ఒత్తిడిని తగ్గించుకోవడం, విటమిన్ డీ తగినంత తీసుకోవాలి. సూర్యరశ్మి సోకేలా చూసుకోవడం ద్వారా శరీరం




మెగ్నీషియంను సంగ్రహించుకునేలా చూసుకోవచ్చు. ప్రేవుల ఆరోగ్యం బాగాఉంటే మెగ్నీషియం సహా పోషకాలను శరీరం మెరుగ్గా గ్రహిస్తుంది. ప్రేవు

# ఇసుక లారీలు పరుగులు.! ధాన్యం లారీలు బంద్.!

●రైతన్న కన్నీరు ఎవ్వరికీ కనిపించదా.!? ప్రభుత్వం ఎక్కడ.!? ●రైతన్న బతికితేనే రాష్ట్రం బతుకుతుంది.! ముందుగా ధాన్యం కొనండి.!

●రైతన్న ఆవేదనకు ఎవరు బాధ్యులు.?
●అన్నదాత కన్నీరు..! ప్రభుత్వ నిర్లక్ష్యం.!
●తెలంగాణలో ధాన్యం కొనుగోలు గందరగోళం.!
●ఇసుక'కు గ్రీన్ సిగ్నల్.! రైతన్న ధాన్యానికి రెడ్ సిగ్నల్.!
●ధాన్యం గుట్టలు పెరుగుతుంటే, ప్రభుత్వం మాత్రం మౌనం.!
●మిల్లర్ల దోపిడీకి రైతన్న బలి.! కొనుగోలు కేంద్రాల్లో కష్టాల పరంపర..!!



●రైతన్న చెమట తడుస్తుంటే, పాలకులకు పట్టదా.!?
●అన్నం పెట్టే అన్నదాత రోడ్డున, ఇసుక దందా మాత్రం జోరుగా.!
●ధాన్యం కొనుగోలు చేయండి. రైతన్నను కాపాడండి.!
●రైతన్న కన్నీరు రాష్ట్రానికి అరిష్టం.! వెంటనే ధాన్యం కొనుగోలు చేపట్టాలి.
●తెలంగాణలో రైతుల ఆవేదన: తూకం లేదు.. టోకెన్ లేదు.. న్యాయం లేదు.!
●వర్షం పడితే రైతన్న బాధ ఊహించలేం.!

డెస్క్, నేటిధాత్రి:
తెలంగాణలో రైతు పండించిన ప్రతి గింజ వెనుక చెమట ఉంది. అప్పు ఉంది. ఆశ ఉంది. కానీ అదే రైతు ధాన్యం అమ్ముకునే సమయానికి ప్రభుత్వ అలసత్వం, మిల్లర్ల దోపిడీ, కొనుగోలు కేంద్రాల అవ్యవస్థ అతడిని మళ్లీ రోడ్డున పడేస్తోంది. "రైతే రాజు" అని సభల్లో చెప్పే నాయకులు, కొనుగోలు కేంద్రాల్లో రైతు పడుతున్న బాధను మాత్రం చూడటం లేదని స్పష్టంగా కనిపిస్తుంది. వానలు, ఎండలు తట్టుకుని పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే రోజులు గడుస్తున్నా తూకం వేయడం లేదు. టోకెన్ల పేరుతో ఆలస్యం చేస్తు, తేమ శాతం పేరుతో కోతలు విధిస్తు, మిల్లర్ల చేతుల్లో దోపిడీకి గురవుతున్నా అన్నదాతలు. ఇదే ప్రస్తుతం తెలంగాణలో రైతులు పరిస్థితి అని చెప్పవచ్చును. ధాన్యం తడిసిపోతే రైతుదే నష్టం, బస్తాలు చినిగినా రైతుదే నష్టం, ట్రాక్టర్లు, లారీల కోసం రోజులు ఎదురు చూసినా ఖర్చు మాత్రం రైతుదే. మిల్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ప్రతి జిల్లాలో వినిపిస్తున్నాయి. "నాణ్యత లేదంటూ" క్వింటాల్‌కు కిలోల కొద్దీ కోతలు విధించడం, అధికారుల మౌన సహకారంతో రైతులను వేధించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత లేకపోవడం వల్ల మధ్యవర్తుల దందా మరింత పెరుగుతోందని, అన్నదాతకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం మాత్రం ప్రకటనలకే పరిమితమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతు పండించిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయకపోతే అతని కుటుంబం ఆర్థికంగా కుదేలవుతుందని, అప్పులు తీర్చలేక రైతు మానసిక వేదనకు గురవుతున్నాడని, ఇది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, రైతు జీవన హక్కుపై నిర్లక్ష్యం అని చెప్పకనే చెప్పవచ్చును. పభుత్వం వెంటనే స్పందించి ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి. తేమ, నాణ్యత పేరుతో అనవసర ఇబ్బందులు పెట్టకుండా రైతుకు న్యాయం చేయాలి. కొనుగోలు కేంద్రాల్లో సరిపడ సిబ్బంది, బస్తాలు, తూకం యంత్రాలు అందుబాటులో ఉంచి, మిల్లర్ల దోపిడీపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు ధాన్యం కొనుగోలులో ఆలస్యం అంటే రైతు కడుపుపై తన్నినట్టేనని ప్రభుత్వం గుర్తెరగాలి. అన్నం పెట్టే రైతు కళ్లలో నీళ్లు ఉంటే, రాష్ట్ర అభివృద్ధి గురించి చెప్పుకోవడం వ్యర్థమని, రైతు బాగుంటేనే తెలంగాణ బాగుంటుందని ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం పాలకుల నైతిక బాధ్యత అని చెప్పవచ్చును.

**ఇసుక లారీలు పరుగులు.! ధాన్యం లారీలు నిలుపుదల.!**
**రైతన్న కన్నీరు ఎవరికీ కనిపించదా.!?**
**"ముందు ధాన్యం కొనుగోలు చేయండి.! అవసరమైతే ఇసుక లారీలను తాత్కాలికంగా బంద్ చేయండి..!!"**
**రాష్ట్రానికి ఇసుక కంటే, అన్నం ముఖ్యం.!**



తెలంగాణ నేలపై ఇప్పుడు ఒక విచిత్ర పరిస్థితి కనిపిస్తోంది. నదుల్లో ఇసుక తరలించే లారీలు రాత్రింబవళ్లు పరుగులు తీస్తుంటే, రైతు చెమటతో పండించిన ధాన్యం మాత్రం కొనుగోలు కేంద్రాల వద్ద గుట్టలుగా పేరుకుపోతోందని, ఒకవైపు కోట్ల రూపాయల ఇసుక వ్యాపారం నిరాటంకంగా సాగుతుండగా, మరోవైపు అన్నదాత తన పంట అమ్ముకోలేక ఆవేదనతో కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నాడని వాస్తవ దృశ్యాలను చూస్తునే ఉన్నాం. వానలు, అప్పులు, కరెంటు సమస్యలు, ఎరువుల భారం అన్నీ తట్టుకుని రైతు పండించిన ధాన్యం ఇప్పుడు కొనుగోలు కేంద్రాల వద్ద తడిసి ముద్దవుతోందని. రోజులు గడుస్తున్నా తూకం లేదు, టోకెన్ లేదు, మిల్లర్లు స్పందన లేదు, కానీ ఇసుక లారీలకు మాత్రం ఎలాంటి అడ్డంకులు లేకుండా రహదారులు తెరిచి ఉన్నాయని, ఈ పరిస్థితి రైతుల్లో తీవ్ర అసంతృప్తిని రగిలిస్తోందని చెప్పవచ్చును.
"రైతే రాష్ట్రానికి వెన్నెముక" అని చెప్పే ప్రభుత్వాలు, ఆ రైతు పంటను సకాలంలో కొనుగోలు చేయడంలో ఎందుకు విఫలమవుతున్నారని.!? అన్నదాత కష్టానికి విలువ ఇవ్వకుండా, మిల్లర్ల దోపిడీకి అవకాశం కల్పించడం ఏ పరిపాలనా ధోరణి? రైతు ధాన్యం తడిస్తే నష్టం రైతుదే, బస్తాలు చినిగితే నష్టం రైతుదే, తేమ శాతం పేరుతో కోతలు పెట్టినా నష్టపోయేది రైతన్న'నే, చివరకు అప్పులు, ఆవేదన, నిరాశ మాత్రమే రైతు చేతిలో మిగులుతున్నాయని సత్యం అందరికీ తెలిసిందే.
ఈ నేపథ్యంలో రైతు సంఘాలు, ప్రజాసంఘాలు ఒకే డిమాండ్ చేస్తున్నాయి – "ముందు ధాన్యం కొనుగోలు చేయండి, అవసరమైతే ఇసుక లారీలను తాత్కాలికంగా బంద్ చేయండి." ఎందుకంటే రాష్ట్రానికి ఇసుక కంటే అన్నం ముఖ్యం. నిర్మాణాలు కొన్ని రోజులు ఆగితే మళ్లీ మొదలవుతాయి, కానీ రైతు గుండె ఆగిపోతే ఆ కుటుంబం తిరిగి నిలబడదు అని రాష్ట్ర ప్రభుత్వానికి గుర్తుచేస్తున్నాం.
రైతన్న కన్నీరు కేవలం ఒక కుటుంబ బాధ కాదు, అది సమాజానికి అరిష్టం.! రైతు ఏడిస్తే పల్లె ఏడుస్తుంది.! పల్లె ఏడిస్తే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది.! రైతు ఆవేదనను రాజకీయంగా కాకుండా మానవీయంగా చూడాల్సిన అవసరం పాలకుల'పై ఉందని చెప్పవచ్చు.

**ప్రభుత్వం వెంటనే స్పందించాలి:**
ఎలాంటి ఆంక్షలు లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలి.
కొనుగోలు కేంద్రాల్లో వేగం పెంచాలి.
మిల్లర్ల అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
రైతులకు తక్షణ చెల్లింపులు చేయాలి.
ధాన్యం రవాణాకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి.
అన్నం పెట్టే రైతు నిలబడితేనే రాష్ట్రం నిలబడుతుంది.! రైతు గింజకు గౌరవం ఇవ్వని పాలన ఎంత గొప్పగా చెప్పుకున్నా ప్రజల గుండెల్లో నిల్వదని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరవాలి, రైతన్నకు అండగా నిలవాలని కోరుకుంటున్నాను.



అచ్చునూరి కిషన్ ముదిరాజ్.
(ఎమ్.ఏ. పొలిటికల్ సైన్స్.)
ములుగు జిల్లా.
ఫోన్ నెంబర్: ౦91 9000986761.

# కాంట్రాక్టర్ల ధర్నాకు బీఆర్ఎస్ మద్దతు

●వారి సమస్యలు వెంటనే పరిష్కరించాలి : కేటీఆర్
●కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు



హైదరాబాద్, నేటిధాత్రి:
హైదరాబాద్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నిర్వహించిన ధర్నాకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మద్దతు ప్రకటించారు. కాంట్రాక్టర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.


**హామీల అమలులో కాంగ్రెస్ విఫలం**
ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన మాటలను మరిచిపోయిందని విమర్శించారు.

**కేసీఆర్ హయాంలో అభివృద్ధి**
కేసీఆర్ పాలనలో అధికారులకు స్వేచ్ఛ ఇచ్చి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేశామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పులు చేసినా వాటిని ప్రజల సంక్షేమానికే వినియోగించామని చెప్పారు.

**కాంట్రాక్టులపై ఆరోపణలు**
ప్రస్తుతం ప్రభుత్వ కాంట్రాక్టులు కొందరు వ్యక్తులకు మాత్రమే కేటాయిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. ప్రజల డబ్బుతో కొందరికి ప్రయోజనం కల్పించే విధంగా వ్యవస్థ పనిచేస్తోందని విమర్శించారు.

**ఢిల్లీ వరకు పోరాటం**
జీవో నెంబర్ 17 రద్దు అయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. అవసరమైతే ఢిల్లీ వరకు వెళ్లి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.

**2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం**
అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని కేటీఆర్ అన్నారు. 2028లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ వారి పక్షాన నిలిచి పోరాడుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.



# పారిశుధ్య కార్మికుల శ్రమను గౌరవిద్దాం

●పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం.. ఆరోగ్యంగా ఉందాం
●ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమం లో కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్



"నేటిధాత్రి", కమలాపూర్.
గ్రామాలు పరిశుభ్రం చేసేందుకు నిత్యం శ్రమించే పారిశుధ్య కార్మికుల శ్రమను గౌరవుంచాలి. ఎవరి పరిసరాలు వారే పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యంగా ఉండాలని కమలాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ పబ్బు సతీష్ అన్నారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా కమలాపూర్‌ను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం అనే కార్యక్రమం వరుసగా నాలుగవ వారం నిర్వహించారు. శనివారం 11 వార్డులో తహశీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు వీధుల్లో సర్పంచ్ సహా గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు చెత్త ఊడ్చి మురికి కాలువలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల శ్రమను గ్రామస్థులకు తెలియజేయడం సహా గ్రామాన్ని పారిశుధ్య పరిరక్షణ గ్రామంగా తీర్చి దిద్దేందుకు ప్రజలను భాగస్వాములను చేయడం లక్ష్యంగా ఊరు కోసం ఒక్క రోజు శ్రమదానం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు అయ్యి ఊరు బాగు కోసం పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, మాజీ ఎంపీపీ మాట రమేష్, వార్డ్ సభ్యులు, అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం



అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# పత్తి పల్లి గ్రామంలో మూగబోయిన వాటర్ ప్లాంట్




●పత్తిపల్లిలో రోజుల తరబడి మూతపడిన వాటర్ ప్లాంట్
●గుక్కెడు సురక్షిత జలం కోసం పత్తిపల్లి వాసుల అవస్థలు
●కలుషిత నీటితో అనారోగ్యాల బారిన పడుతున్న వృద్ధులు, చిన్నారులు
●పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులు

ములుగు జిల్లా, నేటిధాత్రి:
ములుగు జిల్లాలోని పత్తిపల్లి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ మూతపడటంతో గ్రామస్తులు గుక్కెడు సురక్షిత జలం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాల రోజులుగా ప్లాంట్ పని చేయకపోవడంతో, గ్రామంలోని ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు మరియు మహిళలు తాగునీటి కోసం తీవ్రంగా శ్రమించాల్సిన దుస్థితి నెలకొంది. గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ ఆర్ఓ వాటర్ ప్లాంట్ అధికారుల నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారింది. సాంకేతిక లోపాలు, మోటార్ మరమ్మతుల వల్లే ప్లాంట్ మూతపడినట్లు తెలుస్తున్నప్పటికీ, గ్రామ పంచాయతీ పాలకవర్గం కానీ, సంబంధిత ఆర్డబ్ల్యూఎస్ అధికారులు కానీ దీనిని బాగు చేయించేందుకు కనీస శ్రద్ధ చూపడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కలుషిత నీటితో అనారోగ్యాలు:**
వాటర్ ప్లాంట్ మూతపడటంతో గత్యంతరం లేక స్థానికులు సాధారణ బోరు నీటిని, కలుషిత జలాలను తాగాల్సి వస్తోంది. దీనివల్ల గ్రామంలోని చిన్నారులు, వృద్ధులు సీజనల్ వ్యాధులు, డయేరియా, టైఫాయిడ్ లాంటి రోగాల బారిన పడుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థలే ఇలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

**తక్షణమే స్పందించాలి:**
ఈ తాగునీటి సమస్యపై పలుమార్లు స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ములుగు జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి మూతపడిన వాటర్ ప్లాంట్ ను తక్షణమే మరమ్మత్తులు చేయించి పత్తిపల్లి ప్రజల దాహార్తిని తీర్చాలని కోరుతున్నారు.

# రైతు డిస్కం పేరుతో రైతులను మోసం చేసే కుట్ర

●పగటిపూట 7 నుంచి 8 గంటలే కరెంటు ఇవ్వాలని కాంగ్రెస్ యత్నం
●రైతుల సమస్యలు తెలుసుకున్న మాజీ మంత్రి హరీశ్ రావు
●నంగునూరు మండలం ముంద్రాయి గ్రామంలో రైతులతో ముఖాముఖి

సిద్దిపేట, నేటిధాత్రి:
రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేసిన బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచిందని, కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. నంగునూరు మండలం మీదుగా ప్రయాణిస్తున్న సందర్భంగా ముంద్రాయి గ్రామంలో ఆగిన హరీశ్ రావు అక్కడి రైతులతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ కష్టాలను, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

**రైతు డిస్కం పేరుతో కొత్త కుట్ర**
రైతులతో మాట్లాడిన అనంతరం హరీశ్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకురావాలని భావిస్తున్న "రైతు డిస్కం" విధానం రైతుల ఉచిత విద్యుత్‌కు ఉరితాడుగా మారబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ప్రయోజనాల పేరుతో తీసుకొస్తున్న ఈ విధానం వాస్తవానికి వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగించే ప్రమాదం ఉందన్నారు.
రైతు డిస్కంకు ప్రధానంగా సోలార్ విద్యుత్ మాత్రమే కేటాయిస్తారని, దీనివల్ల సూర్యుడు ఉదయించిన తర్వాత మాత్రమే విద్యుత్ సరఫరా ప్రారంభమవుతుందని, సాయంత్రం ఎండ తగ్గగానే విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని వివరించారు. దీంతో రైతులకు రోజుకు కేవలం 7 నుంచి 8 గంటల పాటు మాత్రమే విద్యుత్ అందే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు.

**ఉచిత విద్యుత్‌పై ఆందోళన**
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించామని గుర్తు చేసిన హరీశ్ రావు, ఇప్పుడు రైతుల విద్యుత్ హక్కులను పరిమితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. రైతు డిస్కం అమల్లోకి వస్తే భవిష్యత్తులో రైతులు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.

**రైతుబంధు అమలుపై విమర్శలు**
రైతులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతుబంధు పథకాన్ని నీరుగార్చిందని హరీశ్ రావు ఆరోపించారు. చాలా మంది రైతులకు రైతుబంధు సాయం అందలేదని, కేవలం మూడు ఎకరాల వరకు మాత్రమే పరిమితం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు.
వ్యవసాయ పెట్టుబడులు పెరుగుతున్న సమయంలో రైతులకు ప్రభుత్వం అండగా నిలవాల్సింది పోయి, పథకాల అమలులో కోతలు విధించడం బాధాకరమన్నారు.

**కొనుగోలు కేంద్రాల్లో రైతుల దోపిడీ**
బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేశామని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో ఏ-గ్రేడ్ వడ్ల వ్యవస్థను తొలగించి, వివిధ రకాల కటింగ్‌ల పేరుతో రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. పంట పండించడానికి రైతులు ఒకవైపు శ్రమిస్తుంటే, పండించిన పంటను విక్రయించేందుకు మరోవైపు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడాల్సింది పోయి, వారిని మరింత కష్టాల్లోకి నెడుతోందని విమర్శించారు.

**రైతుల పక్షాన పోరాటం కొనసాగుతుంది**
ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోయినా తాను ప్రతిరోజూ రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటానని హరీశ్ రావు స్పష్టం చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత తీవ్రంగా పోరాడతామని ప్రకటించారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షానే నిలబడుతుందని భరోసా ఇచ్చారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ నిర్ణయాన్నైనా ప్రజలతో కలిసి వ్యతిరేకిస్తామని తెలిపారు.

**రైతుల సంక్షేమమే లక్ష్యం**
వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని, రైతు బాగుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని హరీశ్ రావు పేర్కొన్నారు. రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువస్తుందని స్పష్టం చేశారు.

Printed, Published & owned by Katta Raghavender Rao, Printed at S.V. Offset Printers, H. No. 4-6-65, S.T. Josephes High School,Kumarpalli Hanamkond, Warangal-01. Telangana State. & Published from, H.No.4-6-65, Opp. S.T. Josephes High School,kumarpalli, Hanamkonda, Warangal -506001. Telangana State.
Editor : Katta Raghavender Rao, RNI No. APTEL / 2005/15537. E-mail : netidhatrisv@gmail.com Cell : 9908658888, 8297779999